క్షేత్రస్థాయి అధ్యయనానికి కేంద్ర అధికారులు

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వంలోని సెంట్రల్ సివిల్ సర్వీసెస్‌లో వివిధ కేటగిరీల్లో ఎంపికైన అధికారులు 21 మంది జిల్లాలో క్షేత్రస్థాయి అధ్యయనానికి ఈ నెల 21న ఖమ్మం వస్తున్నారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ పలు అంశాల్లో శిక్షణ అందిస్తోంది. ఇందులో భాగంగా పల్లెల్లో ప్రజల జీవన విధానం, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, తదితర అంశాలపై ఆరా తీయనున్నారు. తిరుమలాయపాలెం మండలం కేశ్యాతండా, కామేపల్లి మండలం రేపల్లెవాడ, సింగరేణి మండలం అలియా తండా, ఏన్కూరు మండలం లచ్చగూడెం గ్రామాలకు అధికారుల బృందాలు వెళ్తాయి. ఈ నెల 21 నుంచి 28 వరకు ఆయా గ్రామాల్లోనూ వారు బస చేస్తారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జడ్పీ సీఈఓ, డీపీఓ ఆయా గ్రామాల్లో కేంద్ర సర్వీసెస్ అధికారులకు ఏర్పాట్లు చేయనున్నారు.

డాక్యుమెంట్లు పెండింగ్‌లో ఉండొద్దు


డీఐజీ సుభాషిణిని సత్కరిస్తున్న ఆడిట్ సబ్ రిజిస్ట్రార్ జ్యోతి, చిత్రంలో డీఆర్ రవీందర్‌రావు, జేఎస్‌ఆర్ సంపత్

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: స్థిరాస్తుల క్రయ విక్రయ లావాదేవీలకు సంబంధించిన డాక్యుమెంట్లు పెండింగ్‌లో ఉంచొద్దని, సత్వరమే పరిష్కరించాలని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ వరంగల్ రేంజి డీఐజీ (డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్) సుభాషిణి అన్నారు. ఖమ్మంలోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాన్ని శుక్రవారం సందర్శించారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జరుగుతున్న లావాదేవాలు, శాఖాపరమైన అంశాలపై సమీక్షించారు. ప్రజలకు సత్వర సేవలు అందించి ప్రభుత్వ ఆదాయం పెరిగేలా కృషి చేయాలని ఆదేశించారు. ఆడిట్ సబ్ రిజిస్ట్రార్ జ్యోతి డీఐజీ సుభాషిణికి శాలువా కప్పి స్వాగతించారు. జిల్లా రిజిస్ట్రార్ రవీందర్‌రావు, ఖమ్మం జాయింట్ సబ్ రిజిస్ట్రార్-1 సంపత్ పాల్గొన్నారు.

లెక్కలేనితనం..!

ఈటీవీ, ఖమ్మం

చెరువులు, కుంటలు, జలాశయాలు నిండుకుండను తలపిస్తున్నాయి. ఈ సమయంలో చేపపిల్లలను పోస్తే ఎదుగుదల బాగుంటుంది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో చేపపిల్లల విడుదల ప్రక్రియ సుమారు రెండు నెలలు ఆలస్యమైంది. మత్స్యశాఖ అధికారుల ఉదాసీనత, గుత్తేదారుల ఇష్టారాజ్యంతో అసలు లక్ష్యం నీరుగారుతోంది.


నేలకొండపల్లి మండలం చెరువుమాదారం చెరువులో చేపపిల్లలను విడుదల చేస్తున్న అధికారులు, తదితరులు

ఆరంభశూరత్వమేనా..?

ఈ ఏడాది ఖమ్మం జిల్లాలోని 864 చెరువుల్లో 1.75 కోట్లు, భద్రాద్రి జిల్లాలోని 743 చెరువుల్లో 88 లక్షల చేపపిల్లలను విడుదల చేయాలని అధికారులు నిర్ణయించారు. గతం కన్నా సుమారు 50శాతం లక్ష్యం తగ్గింది. గతంలో జూన్, జులైలో సమృద్ధిగా వర్షాలు కురిస్తే ఆగస్టు నాటికి చేపపిల్లల విడుదల కార్యక్రమం పూర్తయ్యేది. గుత్తేదారులు పాత బకాయిల విడుదల కోసం పట్టుబట్టడంతో ఈఏడాది టెండర్ల ప్రక్రియ ఆలస్యమైంది. ఈనెల 4న ఉభయ జిల్లాల్లో మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు అట్టహాసంగా చేపపిల్లలను చెరువులు, జలాశయాల్లో విడుదల చేశారు. ఆతర్వాత ఎక్కడా సందడి కనిపించటం లేదు. ఖమ్మం జిల్లాలో ఇప్పటివరకు 35చెరువుల్లో 11.62 లక్షల చేపపిల్లలను మాత్రమే వదిలారు. వీటిలో 35-40 ఎంఎం చేపపిల్లలు 3.50లక్షలు, 80-100 ఎంఎం చేపపిల్లలు 8.12లక్షలున్నాయి. భద్రాద్రి జిల్లా సుజాతనగర్ మండలం సింగభూపాలెం చెరువులో కేవలం లక్ష చేపపిల్లలను విడుదల చేశారు. ఆతర్వాత ఎక్కడా ప్రక్రియ సాగలేదు.

ఇష్టారాజ్యంగా చేపపిల్లల విడుదల

అసలే అంతంతమాత్రంగా సాగుతున్న చేపపిల్లల పంపిణీ ప్రక్రియలోనూ అనేక అవకతవకలు చోటుచేసుకుంటున్నాయి. గుత్తేదారులు ఇష్టారాజ్యంగా చేపపిల్లలను వదులుతున్నా పట్టించుకునే వారే కరవయ్యారు. మత్స్యశాఖ అధికారుల పర్యవేక్షణ కొరవడింది. వాస్తవానికి చేపపిల్లల విడుదల సమయంలో అధికారులు, మత్స్యకారుల సమక్షంలో వాటి సైజు, సంఖ్య లెక్కించాలి. అయితే ఎక్కడా ఈ ప్రక్రియ సాగటం లేదని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. నేలకొండపల్లి మండలం బాలసముద్రం, చెరువుమాదారం, కట్టలమ్మ చెరువుల్లో చేపపిల్లలను శుక్రవారం వదిలారు. ఉదయం నుంచి మత్స్యకారులు ఎదురుచూసినా చేపపిల్లలు రాలేదు. తీరా అందరూ వెళ్లాక హడావుడిగా ఒకరిద్దరు అధికారులు వచ్చి చేపపిల్లలను వదలటం గమనార్హం. బాలసముద్రం చెరువులో 81వేల చేపపిల్లలు వదిలినట్లు లెక్కలు చూపారు. వాస్తవానికి 3 లక్షల చేపపిల్లలు పోయాల్సిన చెరువులో 81వేలకే పరిమితమవటమేంటని మత్స్యకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చేపపిల్లల సైజు, సంఖ్య లెక్కించకుండానే వాటిని చెరువుల్లో వదలటమేంటని ప్రశ్నిస్తున్నారు. మత్స్యశాఖ అధికారులు, గుత్తేదారులు కుమ్మక్కై, గుట్టుచప్పుడు కాకుండా ఈ వ్యవహారం నడుపుతున్నారని మండిపడుతున్నారు.

ఎంపిక చేసిన చెరువుల్లో వదులుతున్న చేపపిల్లలకు, అసలు లక్ష్యానికి పొంతన కుదరట్లేదు. కొన్నిచోట్ల మత్స్యకారులకు సమాచారమివ్వకుండానే చెరువుల్లో పోస్తున్నారు. చేపపిల్లల విడుదల ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా మంత్రులు చొరవ చూపాలి. - మైసా శంకర్, మత్స్యకార సంఘం నాయకుడు, నేలకొండపల్లి

ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు చేపపిల్లల విడుదల ప్రక్రియ జరుగుతుంది. చేపపిల్లల సైజు, సంఖ్యలో తేడాలు లేకుండా చూస్తున్నాం. గతం కన్నా ఈసారి పెద్దసైజు చేపపిల్లలను విడుదల చేస్తున్నాం.
- శివప్రసాద్, జిల్లా మత్స్యశాఖ అధికారి, ఖమ్మం

మినీ డిగ్రీ.. సత్వర ఉపాధి..!

సంప్రదాయ డిగ్రీ కోర్సుల తీరుతెన్నులు వేగంగా మారుతున్న తరుణంలో విద్యార్థులకు అపారమైన ఉపాధి అవకాశాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఇప్పటికే డిగ్రీ విద్యనందిస్తూనే మరోవైపు జాబ్ గ్యారంటీ కోర్సులకు ప్రాధాన్యమిస్తోంది.
- ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే


ఎస్‌ఆర్‌బీజీఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల


ఎస్‌ఆర్‌బీజీఎన్‌ఆర్ కళాశాలకు చోటు

ఈ విద్యాసంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన 38 కళాశాలల్లో బ్యాంకింగ్, ఫైనాన్స్ సర్వీసెస్, ఇన్సూరెన్స్(బీఎఫ్‌ఎస్‌ఐ) విభాగాల్లో కోర్సులను ప్రవేశపెట్టింది. వీటిలో 20 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, 18 ఇంజినీరింగ్ కళాశాలలు ఉండగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి ఖమ్మంలోని ఎస్‌ఆర్‌బీజీఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల(స్వయం ప్రతిపత్తి)కి చోటు దక్కింది. డిగ్రీ పూర్తి చేసిన వెంటనే బ్యాంకింగ్, ఫైనాన్స్, ఇన్సూరెన్స్ రంగాల్లో ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఎస్‌ఆర్‌బీజీఎన్‌ఆర్ కళాశాలలో త్వరలో శిక్షణ మొదలవుతుంది.

రాష్ట్రవ్యాప్తంగా 10వేల మందికి ఉచిత శిక్షణ

రాష్ట్రవ్యాప్తంగా 10వేల మంది విద్యార్థులకు బీఎఫ్‌ఎస్‌ఐ విభాగాల్లో ఉచితంగా శిక్షణ అందిస్తారు. దీని కోసం రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆన్‌లైన్ పోర్టల్‌ను రూపొందిస్తోంది. ఈపోర్టల్‌లో కోర్సు పూర్తిచేసిన విద్యార్థులు తమ వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. నమోదైన విద్యార్థులను బీఎఫ్‌ఎస్‌ఐ కంపెనీలు వీడియో కాల్ ద్వారా మౌఖిక పరీక్షలు నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేసుకుంటాయి. గత నెల 25న సీఎం రేవంత్‌రెడ్డి బీఎఫ్‌ఎస్‌ఐ కోర్సును ప్రారంభించారు.

త్వరలో ఎస్‌ఆర్‌బీజీఎన్‌ఆర్ కళాశాలలో బీఎస్‌ఎఫ్‌ఐ కోర్సులకు సంబంధించిన శిక్షణ మొదలవుతుంది. ఈ అవకాశాన్ని డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. శిక్షణ పూర్తిచేసుకున్న వారికి ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉంటాయి.


- డా.మహ్మద్ జకీరుల్లా, ప్రిన్సిపల్, ఎస్‌ఆర్‌బీజీఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

ప్రత్యేకతలివీ..

- ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్, నల్గొండ, సూర్యాపేట జిల్లాల విద్యార్థులు ఎస్‌ఆర్‌బీజీఎన్‌ఆర్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్నారు.
- రాష్ట్రంలో న్యాక్ A++ 3.64 సీజీపీఏ కలిగిన ఏకైక కళాశాలగా ప్రత్యేకత కలిగి ఉంది.
- ఇక్కడ 45 యూజీ కోర్సులు, తొమ్మిది పీజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.
- యూజీలో 4,800 మంది, పీజీ కోర్సుల్లో 800 మంది విద్యార్థులు చదువుతున్నారు.
- రాష్ట్రంలోని స్వయం ప్రతిపత్తి కళాశాలల్లో ప్రత్యేక గుర్తింపు కలిగి ఉంది.
- ఎప్పటికప్పుడు నూతన పాఠ్యప్రణాళికలు, విద్యార్థి కేంద్రిత నైపుణ్య కార్యక్రమాలు రూపొందిస్తుండటంతో పాటు ఏజెన్సీ(గ్రామీణ, పట్టణ, నగర విద్యార్థుల విద్యనభ్యసించేందుకు 'మినీ విశ్వవిద్యాలయం'గా పేరు గాంచింది.

బీఎస్‌ఎఫ్‌ఐ కోర్సును ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈక్రమంలో ఇక్కడి అధ్యాపకులకు తొలుత శిక్షణ ఇవ్వనుంది. అనంతరం కోర్సు ప్రారంభమవుతుంది. తద్వారా డిగ్రీ తృతీయ సంవత్సరం పూర్తిచేసుకునే సమయానికి 'మినీ డిగ్రీ'గా బీఎస్‌ఎఫ్‌ఐ ఉపయోగపడుతుంది.


- డా.రమాసత్యవతి, ఐక్యూఏసీ సమన్వయకర్త

విద్యార్థులూ జీవితాలను నాశనం చేసుకోవద్దు


సదస్సులో మాట్లాడుతున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: ర్యాగింగ్‌కు పాల్పడుతూ విద్యార్థులు తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ హెచ్చరించారు. ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో శుక్రవారం సే నోటూ ర్యాగింగ్ నినాదంతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశాలకు కొత్తగా వచ్చే విద్యార్థులపై ర్యాగింగ్ మానసిక, శారీరక ఒత్తిడికి దారితీస్తోందని అన్నారు. అలాంటి హింసాత్మకమైన క్రియకు ఎవరూ పాల్పడవద్దని, కఠిన శిక్షలు ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు. ర్యాగింగ్‌కు పాల్పడే వారి సమాచారాన్ని ప్రిన్సిపల్, వార్డెన్, కేర్ టేకర్, పోలీసులకు తెలియజేయవచ్చని సూచించారు. ప్రిన్సిపల్ డా. రాజేశ్వరరావు, హెచ్‌వోడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ పనుల భూ సేకరణకు రూ.3 కోట్లు

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: పాలేరు నియోజకవర్గంలో 65వేల ఎకరాలకు సాగునీరందించే ఎస్సారెస్పీ (శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టు) స్టేజ్-2 కాల్వల మిగుల పనులకు అవసరమైన 14 ఎకరాల భూసేకరణకు రూ.3కోట్ల మంజూరుకు ఉన్నతాధికారులు ఆమోదించారు. హైదరాబాద్‌లో నీటిపారుదలశాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఇంజినీరింగ్ ఉన్నతాధికారులతో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాలేరులో ప్రథమ ప్రాధాన్యతగా ఎస్సారెస్పీ స్టేజ్-2 పనులు వచ్చే మార్చి 31 నాటికి నూరు శాతం పూర్తిచేయాలని నిర్ణయించారు. ఈ కాల్వ కింద ఇప్పటివరకు 35 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు సరఫరా అవుతుండగా మరో 14 ఎకరాల భూమిని సేకరించి కాల్వల అనుసంధాన పనులు చేపట్టి మొత్తమ్మీద 65 వేల ఎకరాలకు సాగునీరందించవచ్చునని ఇంజినీరింగ్ అధికారులు నివేదిక ఇచ్చారు. ఈ పనులకు అవసరమైన నిధుల మంజూరుకు ఉన్నతాధికారులు అంగీకరించినట్లు తెలిసింది. కాల్వల నిర్మాణ పనులు చేపట్టిన గుత్తేదారులకు పెండింగ్ బిల్లులు రూ.8కోట్లను ఇటీవల ప్రభుత్వం విడుదల చేసింది. డీబీఎం- 60 (తల్లంపాడు బ్రాంచి కాల్వ) ప్యాకేజీ-54లోని పంట కాల్వల నిర్మాణం, అనుసంధాన పనులు పూర్తిచేసేందుకు తిరుమలాయపాలెం, కూసుమంచి, ఖమ్మం గ్రామీణ మండలాల్లో అక్కడక్కడ 14 ఎకరాల భూమిని సేకరించేందుకు నిధుల విడుదలకు మార్గం సుగమమైంది. సమావేశంలో నీటిపారుదలశాఖ ఖమ్మం సీఈ విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యకు పూర్వవైభవం తేవాలి


మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, వేదికపై జడ్పీ సీఈఓ దీక్షా రైనా, డీఈఓ సోమశేఖరశర్మ

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ప్రభుత్వ విద్యకు పూర్వవైభవం తెచ్చేందుకు నూతన ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో నూతన ఉపాధ్యాయులతో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మనం సాధించిన ఫలితాలను ప్రచారం చేసుకోకపోవడంతోనే ప్రభుత్వ విద్యకు ప్రాధాన్యం తగ్గిందని వివరించారు. పిల్లల కోసం మనం ఉద్యోగం చేస్తున్నామన్న అంశాన్ని ఎప్పుడూ మరచిపోవద్దని సూచించారు. తాను ఏడోతరగతి చదివేటప్పుడు విజయలక్ష్మి అనే టీచర్ తనపై పెట్టిన శ్రద్ధ కారణంగానే నేడు కలెక్టర్‌గా ఉన్నానని పేర్కొన్నారు. జడ్పీ సీఈఓ దీక్షా రైనా, డీఈఓ ఈ.సోమశేఖరశర్మ, సీఎంఓ రాజశేఖర్, ఏఎంఓ రవికుమార్ పాల్గొన్నారు.

☆ విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞానం పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ అన్నారు. ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే చెకుముఖి సైన్స్ సంబరాల గోడపత్రికను ఆవిష్కరించారు. నాగేశ్వరరావు, మోహన్, రామారావు, శివన్నారాయణ, డాన్‌బోస్కో, ఎల్వీరెడ్డి పాల్గొన్నారు.

గ్రూప్-3 పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: గ్రూప్-3 పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. గ్రూప్-2, 3 పరీక్షల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై టీజీపీఎస్సీ ఛైర్మన్ హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో గ్రూప్-3 పరీక్షలకు 28,468 మంది అభ్యర్థుల కోసం 87 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. అదనపు కలెక్టర్ డా. శ్రీజ, అదనపు డీసీపీ నరేశ్‌కుమార్, ఏసీపీ రమణమూర్తి, ఏటీఓ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

☆ ఇందిరా మహిళా డెయిరీ ప్రాజెక్టును ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ సూచించారు. కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో మాట్లాడారు. డిసెంబరు లోగా పాడి రైతులకు గేదెలు పంపిణీ చేయాలన్నారు. డీఆర్డీఓ సన్యాసయ్య, ఎల్డీఎం శ్రీనివాసరెడ్డి, డీఏఓ పుల్లయ్య, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి వేణుమనోహర్ పాల్గొన్నారు.

ఖమ్మం నగరం: కలెక్టరేట్‌లో తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ధరణి తదితర దరఖాస్తులు పరిష్కరించాలని ఆదేశించారు. ఖమ్మం రూరల్ మండలం మినహా మిగతా మండలాల తహసీల్దార్లు వరదల సమయంలో ధ్రువపత్రాలు జారీ చేసేందుకు ప్రజలను ఇబ్బందులకు గురి చేసినట్లు తెలిసిందన్నారు. కల్లూరు ఆర్డీఓ రాజేందర్ పాల్గొన్నారు.

ఖమ్మం కమాన్‌బజార్: మనకు ఎవరూ లేరు.. ఏ తోడ్పాటును అందించరు అనే భావన వద్దని, మేమంతా మీతోనే ఉన్నామని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ బాల సదనం పిల్లలకు భరోసా కల్పించారు. ఖమ్మంలోని బాల సదనాన్ని సందర్శించారు. సత్తుపల్లిలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో చదవుతున్న బాల సదనం విద్యార్థిని కె.కావ్యకు ల్యాప్‌టాప్ పంపిణీ చేశారు. డీడబ్ల్యూవో కె.రాంగోపాల్‌రెడ్డి, డీసీపీవో విష్ణువందన పాల్గొన్నారు. తిరిగి వెళ్లే సమయంలో కలెక్టర్ మార్గమధ్యలో ఓ లాండ్రీ దుకాణం వద్ద ఆగారు. నిర్వాహకులు ఉపేందర్ ఆయన సోదరితో ముచ్చటిస్తూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు.

ఉద్యోగం పేరిట మోసం.. ఇద్దరిపై కేసు

ఖమ్మం నేరవిభాగం: జిల్లా సర్వజనాసుపత్రిలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ రూ. 3లక్షలు తీసుకుని మోసగించిన ఇద్దరిపై ఖమ్మం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ కథనం ప్రకారం... ఖమ్మం గ్రామీణ మండలం గుర్రాలపాడుకు చెందిన కొట్టె దిలీప్, మరో ముగ్గురికి ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఖమ్మం నగరానికి చెందిన లక్ష్మణ్, లీలాబాయి నమ్మించారు. వారందరి నుంచి రూ. 3లక్షలు వసూలు చేసి ఉద్యోగం వచ్చిందంటూ నియామక పత్రాలిచ్చారు. వాటితో ఉద్యోగాల్లో చేరేందుకు ప్రయత్నించగా అవి నకిలీ నియామక పత్రాలని తెలిసింది. తాము మోసపోయామని గుర్తించి లక్ష్మణ్, లీలాబాయిని నిలదీశారు. నగదు తిరిగి ఇస్తామంటూ ఆరు నెలలుగా తిప్పుకొంటుండటంతో విసుగు చెందిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

నవోదయ విద్యాలయం ఏర్పాటు చేయండి


కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: విభజన చట్టంలో ఇచ్చిన హామీల మేరకు తెలంగాణలో ఐఐఎం, ప్రతి జిల్లాలో నవోదయ విద్యాలయం ఏర్పాటు చేయాలని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కోరారు. దిల్లీలోని మంత్రికి శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

ఐటీఐల్లో అందుబాటులోకి కొత్త ట్రేడ్లు


వీసీలో అదనపు కలెక్టర్ శ్రీజ, కార్మిక శాఖ కమిషనర్ కృష్ణవేణి

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: కాలానుగుణంగా ప్రభుత్వ ఐటీఐ కళాశాలలను ఆధునిక నైపుణ్య కేంద్రాలుగా మార్చుతూ కొత్త ట్రేడ్లు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు కార్మిక శాఖ ముఖ్య కార్యదర్శి సంజయ్‌కుమార్ తెలిపారు. హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. అదనపు కలెక్టర్ డా.శ్రీజ మాట్లాడుతూ జిల్లాలోని ఐటీఐల్లో ఆ ట్రేడ్లకు సంబంధించి 172 సీట్లు ఉండగా 60 భర్తీ అయినట్లు తెలిపారు. మిగతా సీట్ల భర్తీకి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. సహాయ కమిషనర్ కృష్ణవేణి, కార్మిక శాఖ అధికారులు వెంగమ్మ, రమేశ్ పాల్గొన్నారు.

అయ్యో రామా.. ఎన్నాళ్లిలా..?

భద్రాచలం, న్యూస్‌టుడే

భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయాధికారులు, ఉద్యోగుల మధ్య అగాధం ఏర్పడుతోంది. అధికారుల నిర్ణయాలు సరిగ్గానే ఉంటాయంటున్నా.. కొన్నిసార్లు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఉద్యోగులు చెబుతున్నారు. ఆంజనేయస్వామి, లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయాలకు సిబ్బంది సరిపడా లేరనే కారణంతో గురువారం కొన్ని గంటల పాటు తాళాలు వేసి ఉంచటం వివాదాస్పదమైంది. సర్దుబాటు చేసే పరిస్థితి ఉన్నా కావాలనే కొందరు ఉద్యోగులు ఈ తతంగం నడిపించారని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఈవిషయంపై అదేరోజు సాయంత్రం ఈఓ రమాదేవి తమ ఉద్యోగులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. సమావేశ క్రతువును వీడియో తీయించారంటే ఇక్కడ నెలకొన్న అపనమ్మకాలు ఏస్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. ధర్మకర్తల మండలి ఏర్పడితే పాలకవర్గ సభ్యులు చొరవ తీసుకునే వీలుంటుంది. ఎలాంటి సమస్య ఉన్నా నేరుగా ప్రభుత్వంతో చర్చించవచ్చుననే వాదనలు వ్యక్తమవుతున్నాయి.



అభివృద్ధిపై అడుగు పడాలంటే..

రామాలయ అధికారులు చురుగ్గా వ్యవహరిస్తుండటంతో గతేడాది రూ.80కోట్లు ఉన్న ఆదాయం ఈసారి రూ.100 కోట్లకు చేరుకునే వీలుంది. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించటంతో భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రభుత్వం రూ. వందల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కసరత్తు చేస్తోంది. నిర్వాసితులకు పరిహారం చెల్లించేందుకు రూ.60.20కోట్లు కేటాయించింది. రూ.కోటితో కల్యాణమండపం వద్ద శాశ్వత షెడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఇలాంటి కీలక సమయంలో వివాదాలు తగవని భక్తులు చెబుతున్నారు. సమన్వయలోపం తలెత్తకుండా ఈఓ, వైదిక బృందం చొరవ చూపాలని కోరుతున్నారు.

కలహాలు తీరేనా..?

☆ ఇటీవల ఆలయ ప్రధానార్చకుడు, అతడి కుమారుడు కుటుంబ కలహాలతో రచ్చకెక్కాల్సి వచ్చింది. వీరిద్దరిపై కేసు నమోదు కావటంతో సస్పెండయ్యారు.

☆ ఇటీవల ఇద్దరు వైదిక పెద్దలు దసరా ఉత్సవాలకు తిరుపతి వెళ్లి ప్రవచనాలిచ్చారు. సెలవు తీసుకోకుండా ఎలా వెళ్తారని వీరికి ఈఓ మెమోలు జారీ చేశారు.

☆ ఓ అర్చకుడు ఇక్కడ విధులకు హాజరవకుండా వేరే దేశం వెళ్లారు. అతడిని విధుల నుంచి తొలగించారు. క్రమశిక్షణ చర్యలు తీసుకుంటున్నా ఆస్థాయిలో పోస్టులను భర్తీ చేయటం లేదు.

☆ ఇక్కడి అవసరాల నిమిత్తం సిబ్బంది సంఖ్య పెంచాలి. 36 మంది వైదిక సిబ్బంది సేవలందించాల్సి ఉంది. పరిచారక పోస్టులను భర్తీ చేయకపోవటంతో తీర్థప్రసాదాల పంపిణీ భారంగా మారుతోంది.

☆ ఈతరహా సమస్యలకు మూలాలు తెలిసిన వైదిక పెద్దలు వీటిని పరిష్కరించేందుకు చొరవ చూపటం లేదు. గొడవలు వచ్చినా అంతర్గత ఆలయాలను మూసే పరిస్థితి రాకుండా చూడాలి.


అమ్మపేటలో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

మత విద్వేషాలను రెచ్చగొడుతున్న భాజపా: తమ్మినేని

ముదిగొండ, న్యూస్‌టుడే: కులాల మధ్య చిచ్చుపెట్టి, మత విద్వేషాలను రెచ్చగొట్టి భాజపా పబ్బం గడుపుకొంటోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. అమ్మపేటలో సీపీఎం మండల మహాసభ బి.పురుషోత్తం అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ ఏటా కోటి ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన ప్రధాని మోదీ.. పదేళ్లలో పదివేల కొలువులూ ఇవ్వలేదన్నారు. భారత్‌ను హిందూ దేశంగా మార్చాలన్నదే భాజపా లక్ష్యమని విమర్శించారు. దేశంలో అత్యాచారాలు పెరిగిపోయాయని, కమ్యూనిస్టుల ఐక్యఫ్రంట్ ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు వివరించారు. ప్రొఫెసర్ సాయిబాబా మరణం సహజమైంది కాదని, అది ప్రభుత్వ హత్య అన్నారు. కేంద్రంలోని భాజపా, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయటంలో విఫలమయ్యాయన్నారు. పార్టీ మండల కార్యదర్శిగా బి.పురుషోత్తంను రెండోసారి ఎన్నుకున్నారు. సీపీఎం రాష్ట్ర నాయకుడు పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేశ్, చింతలచెర్వు కోటేశ్వరరావు, వాసిరెడ్డి వరప్రసాద్, బండి పద్మ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం: పీవో రాహుల్

పాల్వంచ పట్టణం, న్యూస్‌టుడే: క్రీడలు మానసిక ఉల్లాసాన్నిస్తాయని ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు హాజరయ్యే క్రీడాకారుల కోసం జిల్లా స్థాయి ఎంపికలను పాల్వంచ మండలం కిన్నెరసాని మోడల్ క్రీడా పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన అనంతరం పీవో మాట్లాడుతూ క్రీడలు విద్యార్థులకు పోరాట పటిమను అలవర్చుతాయన్నారు. వారిలో శారీరక దృఢత్వం మెరుగవుతుందన్నారు. ఏడు డివిజన్ల నుంచి వచ్చిన విద్యార్థులు మంచి ప్రతిభ చూపాలన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో త్వరలో జరగనున్న రాష్ట్ర క్రీడా పోటీల్లో భద్రాచలం ఐటీడీఏ నుంచి అత్యధిక పతకాలు సాధించాలన్నారు. శుక్రవారం బాలికల కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్స్ లీగ్ పోటీలను పీడీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీడీ మణెమ్మ, క్రీడల అధికారి గోపాలరావు, అదనపు క్రీడల అధికారులు వెంకటనారాయణ, రాంబాబు, నాగేశ్వరరావు, ఏటీడీవోలు చంద్రమోహన్, జహీరుద్దీన్, అశోక్‌బాబు, ప్రధానోపాధ్యాయులు రామారావు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.


జ్యోతి వెలిగించి క్రీడలను ప్రారంభిస్తున్న ఐటీడీఏ పీవో రాహుల్

అభయారణ్యాన్ని సందర్శించిన శిక్షణ ఎఫ్‌బీవోలు

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: కిన్నెరసాని అభయారణ్యాన్ని దూలపల్లి అటవీ శాఖ అకాడమీకి చెందిన 33 మంది శిక్షణ ఎఫ్‌బీవోలు శుక్రవారం సందర్శించారు. అభయారణ్యం విశేషాలను వారు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల సంరక్షణ, మొక్కల పెంపకం తదితర అంశాల గురించి ఎఫ్‌డీవో బాబురావు వివరించారు. అనంతరం మందరికలపాడు ప్లాంటేషన్‌ను అకాడమీ బృందం పరిశీలించింది. ఈ కార్యక్రమంలో రేంజర్ కవిత మాధురి, వంశీకృష్ణ, ఎఫ్ఎస్‌వో కిషన్, ఎఫ్‌బీవో రాములు తదితరులు పాల్గొన్నారు.


మొక్కల సంరక్షణ వివరాలు తెలుపుతున్న రేంజర్ వంశీకృష్ణ

ఆన్‌లైన్‌లో నమోదుతో.. ఇసుక పొందండిలా..

చర్ల, దుమ్ముగూడెం, న్యూస్‌టుడే

జిల్లాలో మన్యంలో గిరిజన సొసైటీ ఇసుక రీచ్‌ల నుంచి ఇసుక అమ్మకాలు ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా ప్రారంభమయ్యాయి. చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో గోదావరి ఇసుక రీచ్‌ల ద్వారా టీజీఎండీసీ (తెలంగాణ స్టేట్ మినరల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్) సమక్షంలో ఇసుక డంపింగ్ పాయింట్ల నుంచి ఈ అమ్మకాలు కొనసాగుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వినియోగదారులు బుక్ చేసుకున్న ఇసుకను లారీల ద్వారా తరలిస్తున్నారు.


పెద్దిపల్లి డంపింగ్ పాయింట్ నుంచి లారీకి లోడ్ చేస్తున్న ఇసుక

పెద్దిపల్లి రీచ్ నుంచి..

చర్ల మండల పరిధిలోని పెద్దిపల్లిలో 'పెద్దిపల్లి మహిళా ట్రైబల్ సొసైటీ' ద్వారా తవ్వకాలు జరిపిన ఆన్‌లైన్ ప్రక్రియలో నమోదు చేసుకున్న వారికి ఇసుకను విక్రయిస్తున్నారు. ఇక్కడి డంపింగ్ పాయింట్‌లో 50వేల క్యూబిక్ మీటర్ల ఇసుక నిల్వ ఉంది. క్యూబిక్ మీటరు (టన్నున్నర)కు ప్రభుత్వ నిర్దేశిత ధర రూ.600 డీడీ ద్వారా చెల్లించి వినియోగదారులు ఇసుకను కొనుగోళ్లు చేస్తున్నారు. టీజీఎండీసీ, సొసైటీ సభ్యుల సమక్షంలో ఈ అమ్మకాలు జరుగుతున్నాయి.

ప్రారంభమైన డీసిల్టింగ్..

సీతమ్మసాగర్ ప్రాజెక్టు పరిధిలోని చర్ల మండలంలోని జీపీపల్లి పంచాయతీలోని వీరాపురంలోని సర్వే నంబరు 23లో, జీపీపల్లిలోని సర్వే నంబరు 50లో 9.13 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను డీసిల్టింగ్ ద్వారా వెలికితీసే పనులు ఈనెల 7న పునఃప్రారంభమయ్యాయి. మూడు నెలల కిందట ఇక్కడ డీసిల్టింగ్ పనులు ప్రారంభమై అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఈ పనులు తిరిగి ప్రారంభం కాగా గతంలో డంపింగ్ పాయింట్‌లో నిల్వ చేసిన 10వేల క్యూబిక్ మీటర్ల ఇసుక అమ్మకాలను టీజీఎండీసీ ద్వారా ఆన్‌లైన్ ప్రక్రియలో విక్రయిస్తున్నారు. ✦ దుమ్ముగూడెం మండలం నందులచెలక గ్రామంలోని చాముండేశ్వరి మహిళా గిరిజన సొసైటీ ఆధ్వర్యంలోనూ ఇసుక అమ్మకాలు సాగుతున్నాయి. 30వేల క్యూబిక్ మీటర్ల మేర ఇసుక నిల్వ ఉంది. ఆన్‌లైన్ ప్రక్రియలో అమ్మకాలు చేస్తున్నారు.

బుకింగ్ ఇలా..

✦ టీజీఎండీసీ ఆధ్వర్యంలో ఎస్ఎస్ఎంఎంఎస్ (శాండ్ సేల్ మేనేజ్‌మెంట్ అండ్ మానిటరింగ్ సిస్టమ్) పోర్టల్ ద్వారా ఇసుకను ఆన్‌లైన్ విధానంలో బుక్ చేసుకోవాలి. తొలుత sand.telangana.gov.in పోర్టల్‌ను సందర్శించి కస్టమర్ రిజిస్ట్రేషన్‌ను ఎంచుకోవాలి. మొబైల్ నంబరు నమోదు ద్వారా వచ్చే ఓటీపీని ఎంటర్ చేసి రిజిస్ట్రేషన్ ఫారంలో పూర్తి వివరాలు నమోదు చేయాలి. ఆన్‌లైన్ చెల్లింపు అనంతరం రసీదును పొంది దానిని డౌన్‌లోడ్ చేసుకోవాలి.

✦ ఎస్ఎస్ఎంఎంఎస్ వెబ్ పోర్టల్ ద్వారా ఇసుక డెలివరీ, వాహన రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలి. వాహనం(లారీ, ట్రాక్టర్) ఉన్న వారు వెబ్‌పోర్టల్‌లో తమ ఖాతాను నమోదుచేసుకోవచ్చు. ఎస్ఎస్ఎంఎంఎస్ తెలంగాణ పోర్టల్‌లో అంతర్రాష్ట్ర ఆర్డర్ ఐడీని నమోదు చేసుకొని కూడా ఇసుక బుకింగ్ చేసుకోవచ్చు. ఇసుక బుకింగ్ కోసం హెల్ప్‌లైన్ నంబరు 040-233323150లో సలహాలు తీసుకోవచ్చు.

✦ సైట్‌లోకి వెళ్లి ఇసుక డెలివరీ పాయింట్‌ను సెలక్ట్ చేసుకోవాలి. ఇసుక రవాణా కోసం వినియోగించే వాహనం తప్పనిసరిగా వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ అయి ఉండాలి. డంపింగ్ పాయింట్ నుంచి ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం వరకు అమ్మకాల ప్రక్రియ సాగుతుంది. ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా నిర్దేశిత ధరతో ఇసుక అమ్మకాలు సాగుతాయి.

కెమెరాలకు చిక్కని చిరుతపులి

జూలూరుపాడు, న్యూస్‌టుడే: జూలూరుపాడు అటవీ రేంజ్ పరిధిలో సంచరిస్తున్న చిరుతపులి కోసం అటవీ శాఖ అధికారులు గాలిస్తున్నారు. ఇప్పటి వరకు దాని పాదముద్రలు తప్ప పులి జాడ కనిపించలేదు. ఎర్రగుట్ట పరిసర ప్రాంతాల్లో ఇది సంచరిస్తూ ఉండవచ్చని అటవీ అధికారులు భావిస్తున్నారు. పులి కదలికలపై నిఘా పెట్టిన సిబ్బంది నాలుగు రోజుల క్రితం శునకాన్ని లాక్కెళ్లిన ప్రాంతాల్లో రెండు కెమెరాలను సైతం అమర్చారు. వాటిని శుక్రవారం పరిశీలించారు. కానీ ఎలాంటి దృశ్యాలు నమోదు కాలేదని అటవీ రేంజి అధికారి ప్రసాదరావు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. సమీపంలో రెండు, మూడు పెద్దగుట్టలు ఉండటంతో పైకి వెళ్లి ఉండవచ్చని పేర్కొన్నారు. మరో వైపు జనం అలజడి వల్ల ఈ వైపు రాకపోవచ్చన్నారు. కెమెరాలను మరో వైపు ఏర్పాటు చేసి దాని కదలికలను పరిశీలిస్తామన్నారు. మరో వైపు వర్షం లేకపోవడంతో నేల పొడిగా మారిందని, దీని వల్ల పాదముద్రలు గుర్తించలేని పరిస్థితులు ఉన్నాయన్నారు. రైతులు మాత్రం అప్రమత్తంగా ఉండాలన్నారు. పది రోజులపాటు దీని కోసం గాలిస్తూనే ఉంటామని, రైతులకు ఎప్పటికప్పుడు సూచనలిస్తున్నామని చెప్పారు.

సంధ్యా సమయం.. వర్ణచిత్ర శోభితం



సాయం సంధ్యా సమయం ఎంతో అందాల శోభితంగా ఆవిష్కృతమై చూపరులను ఇట్టే ఆకట్టుకుంది. చర్ల మండలంలోని తేగడ తాలిపేరు నది వద్ద శుక్రవారం సూర్యాస్తమయ సమయంలో ఎంతో చూడముచ్చటగా కనిపించిన ఈ దృశ్యాన్ని ప్రకృతి ప్రేమికులు ఆస్వాదించారు. – చర్ల, న్యూస్‌టుడే

అజాగ్రత్తగా నడిపితే అగాథంలోకే..!



రక్షణ గోడలు లేకపోవడంతో పాలేరు కాజ్‌వే ప్రాంతం ప్రమాదకరంగా మారింది. ఖమ్మం- సూర్యాపేట రహదారిలో పాలేరు జలాశయం అలుగు ప్రాంతంలో సుమారు 350 మీటర్ల కాజ్‌వే ఉంది. గతంలో ఇక్కడ దిమ్మెలు నిర్మించినా వాహనాలు ఢీకొనటంతో కొన్ని ధ్వంసమయ్యాయి. ఇటీవల వరద ఉద్ధృతికి మరికొన్ని దెబ్బతిన్నాయి. చోదకులు ఏమాత్రం అజాగ్రత్తగా వాహనం నడిపినా 10-20 అడుగుల ఎత్తుపై నుంచి కిందపడే ప్రమాదం పొంచి ఉంది. గతంలో ప్రమాదాలూ జరిగాయి. ఈ విషయంపై ఆర్‌అండ్‌బీ ఏఈ దేవేందర్ 'ఈనాడు'తో మాట్లాడుతూ కాజ్‌వేపై కర్బ్‌వాల్స్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. – ఈనాడు, ఖమ్మం, న్యూస్‌టుడే, కూసుమంచి

ఒరిగిన స్తంభం.. ప్రమాదానికి సంకేతం..!



భారీ వర్షాలు, గాలి దుమారం.. విద్యుత్తు లైన్లకు శాపాలుగా పరిణమించాయి. సెప్టెంబర్ 1న కురిసిన వానలకు కూసుమంచి మండలం జీళ్లచెరువు 33/11 కేవీ సబ్‌స్టేషన్ నుంచి సరఫరా చేసే రెండు 11కేవీ లైన్లల్లో స్తంభాలు ఒరిగి ప్రమాదకరంగా మారాయి. జీళ్లచెరువు ఎస్సీ కాలనీ ప్రాంతంలోని ఈ స్తంభాలను ఇప్పటివరకు సరిచేయలేదు. ఈ అంశంపై కూసుమంచి ఏడీఈ కోక్యానాయక్ 'ఈనాడు'తో మాట్లాడుతూ విద్యుత్తు లైన్ చుట్టూ వివిధ రకాల పంటలను పండిస్తుండటంతో వాహనం వెళ్లే అవకాశం లేదన్నారు. అందుకే స్తంభాలను సరిచేయలేకపోయామని తెలిపారు. సత్వరం సిబ్బందితో సాధ్యమైనంత మేరకు సరిచేస్తామని చెప్పారు. పంట కోతలు పూర్తయ్యాక యంత్రాలతో లైన్లను పూర్తిస్థాయిలో పునరుద్ధరిస్తామన్నారు. – ఈనాడు, ఖమ్మం, న్యూస్‌టుడే, కూసుమంచి

శివభార్గవికి ఆర్థిక సాయం

సత్తుపల్లి, న్యూస్‌టుడే: వైద్య విద్యలో సీటు సాధించిన స్థానిక గుడిపాడుకు చెందిన గిరిపుత్రిక శివభార్గవికి దాతలు అండగా నిలుస్తున్నారు. ఖమ్మానికి చెందిన పరిశ సీతారత్నం ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు పుల్లయ్య శుక్రవారం కల్లూరు ఏసీపీ ఎ.రఘు చేతుల మీదుగా రూ.25 వేల విద్యార్థినికి అందజేశారు. లారీ అసోసియేషన్ అధ్యక్షుడు రావి నాగేశ్వరరావు రూ.10 వేలు అందించారు. అమెరికాలో ఉంటున్న తన కుమార్తె నవ్య, అశోక్ దంపతులు ఈ సాయాన్ని పంపినట్లు తెలిపారు. విద్యార్థిని తల్లిదండ్రులు ప్రసాద్, నాగమణి, కాంగ్రెస్ నాయకుడు ఉడతనేని అప్పారావు, ఎస్జీపీఏటీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి పాల్గొన్నారు.


ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న కల్లూరు ఏసీపీ ఎ.రఘు, ట్రస్ట్ బాధ్యుడు పరిశ పుల్లయ్య

ఈనాడు కథనానికి స్పందన

వైద్య విద్యార్థికి చేయూత

నేలకొండపల్లి, న్యూస్‌టుడే: వైద్య విద్యలో ప్రవేశం సాధించిన విద్యార్థి ఆర్థిక ఇబ్బందులు ప్రస్తావిస్తూ 'దాతలు స్పందిస్తే.. ఆ ఊరిలో తొలి వైద్యుడు' శీర్షికన శుక్రవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి దాతలు స్పందించారు. ఎంబీబీఎస్ సీటు సాధించిన సుర్దేపల్లి గ్రామానికి చెందిన మాతంగి శ్రీపతికి పలువురు ఫోన్, గూగుల్ పే రూపంలో శుక్రవారం సాయం అందించారు. బొల్లినేని మధుసూదన్ రూ.5 వేలు, జాస్తి లత, రాజా రమేష్, జంగ వెంకటరమణ రూ.3 వేల చొప్పున, పెదార్ల హరిబాబు, అయిత రాజశేఖర్, పీవీఎస్ సాయి తదితరులు రూ.2 వేల చొప్పున సాయం అందించారు. సుమారు రూ.30 వేలు విద్యార్థికి సమకూరాయి. కొందరు దాతలు చరవాణిలో సంప్రదించి వివరాలు తెలుసుకుని భరోసా ఇచ్చారు.

రూ.1.96 లక్షల వెండి మకరతోరణం బహూకరణ


మణుగూరు పట్టణం, అశ్వాపురం, న్యూస్‌టుడే: అశ్వాపురం సాయిబాబా ఆలయంలోని విఘ్నేశ్వరస్వామి, మణుగూరు సాయినగర్‌లోని విజయ విఘ్నేశ్వరస్వామిలకు అశ్వాపురం గ్రామానికి చెందిన సూదిరెడ్డి విజయేందర్‌రెడ్డి, విష్ణుకుమారి దంపతుల కుమారుడు ముకేశ్‌రెడ్డి రూ.1.96 లక్షలతో రెండు కిలోల వెండి మకరతోరణం చేయించి శుక్రవారం బహూకరించారు. అమెరికాలోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ముకేశ్‌రెడ్డికి ఉద్యోగం వచ్చిన సందర్భంగా వీటిని అందించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు దోసపాటి నాగేశ్వరరావు, ఆలయ అర్చకులు సంతోష్ పవన్ కుమారశర్మ, సాయి గణశర్మ వారిని శాలువాలతో సత్కరించారు.


మణుగూరు సాయినగర్‌లోని విజయ విఘ్నేశ్వర స్వామికి వెండి మకరతోరణం బహూకరించిన దాతలు

రామగుండం-మణుగూరు రైల్వేలైన్ పనుల్లో కదలిక

భూసేకరణ ప్రక్రియకు చర్యలు

మణుగూరు పట్టణం, గోదావరిఖని, న్యూస్‌టుడే: రామగుండం-మణుగూరు రైల్వే లైన్ పనుల్లో కదలిక ఏర్పడింది. 207.80 కి.మీటర్లు నిర్మించాల్సిన ఈ రైల్వేమార్గంపై కేంద్ర ప్రభుత్వం అధీకృత అధికారులను ఈనెల 17వ తేదీన నియమించిన విషయం తెలిసిందే. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో ప్రారంభమయ్యే ఈ మార్గం జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి జిల్లాల మీదుగా రామగుండం వెళ్తుంది. రైల్వే లైన్ నిర్మాణ పనులు, నిర్వహణ బాధ్యతలను సంబంధిత ముగ్గురు అధికారులు పర్యవేక్షించనున్నారు.



రైలు మార్గం రేఖాచిత్రం

ఏడాది కిందటే సర్వే పూర్తి

రామగుండం-మణుగూరు రైల్వే పనుల సర్వేలు ఏడాది కిందటే పూర్తి చేశారు. ఆయా జిల్లా కలెక్టర్లకు నివేదికలు అప్పగించారు. రైలు మార్గానికి ఎంత భూమి సేకరించాలి? పరిహారం చెల్లింపు అంశాలను అధికారులు యజమానులతో మాట్లాడి చర్యలు చేపట్టనున్నారు. ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతర జరిగే మేడారం ప్రాంతం మీదుగా ఈ రైలు మార్గం వెళ్తుంది. దీంతో మారుమూల అటవీ ప్రాంతాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగవుతుంది. సాధ్యమైనంత త్వరగా భూసేకరణ పనులు పూర్తి చేసుకుంటే నిర్మాణ పనులు వేగం అందుకునే అవకాశం ఉంది.

ఏటీసీ కోర్సులతో ఉజ్వల భవిష్యత్తు

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఏటీసీ(అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్)లో అందుబాటులో ఉన్న కోర్సులతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని రాష్ట్ర ఉపాధి, శిక్షణ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎస్‌వీకే నగేష్ పేర్కొన్నారు. మణుగూరులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలను శుక్రవారం సందర్శించిన ఆయన ఏటీసీ ప్రవేశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అందుబాటులో ఉన్న ఆరు కోర్సులకు సంబంధించిన ప్రవేశాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పూర్తిస్థాయిలో ప్రవేశాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అనంతరం ఏటీసీ భవనం నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణ పనులు వేగవంతం చేయాలని గుత్తేదారును ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేస్తున్న ఏటీసీ కోర్సులను స్థానిక యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఐటీఐ ప్రిన్సిపల్ బడుగు ప్రభాకర్ టీవో రవి, సూపరింటెండెంట్ జ్యోతిరాణి, సీనియర్ అసిస్టెంట్ సయ్యద్, ఏటీవోలు మయ్యా శ్రీనివాసరావు, జీవీ కృష్ణారావు, నర్సయ్య, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.


కళాశాలలో సూచనలిస్తున్న రాష్ట్ర ఉపాధి, శిక్షణ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎస్‌వీకే నగేష్

21న డీఈఈ సెట్ ధ్రువపత్రాల పరిశీలన

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: టీజీ డీఈఈ సెట్-2024 పరీక్షలో అర్హత సాధించినప్పటికీ ధ్రువపత్రాల పరిశీలనకు వివిధ కారణాల వల్ల హాజరు కాలేకపోయిన వారికి మరోసారి ఈ నెల 21న ఖమ్మం డైట్ కళాశాలలో పరిశీలనకు అవకాశం కల్పించినట్లు కళాశాల ప్రిన్సిపల్ సామినేని సత్యనారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫేజ్-1 వెబ్ కౌన్సెలింగ్‌లో భాగంగా అభ్యర్థులు వెబ్ ఆధారిత కళాశాల ప్రాధాన్యతలను ఈ నెల 23 నుంచి 26 వరకు ఇవ్వొచ్చని పేర్కొన్నారు. సీటు కేటాయింపు ఈ నెల 30న జరుగుతుందని చెప్పారు. ఆన్‌లైన్ రుసుం చెల్లించి తుది ప్రవేశ లేఖ ఈ నెల 30 నుంచి నవంబరు 3 వరకు పొందవచ్చన్నారు. కళాశాలలో ఈ నెల 30 నుంచి నవంబరు 4లోపు రిపోర్టు చేయాల్సి ఉంటుందని, 4 నుంచే మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభమవుతాయని వివరించారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాతకక్షలతో యువకుడిపై దాడి.. అట్రాసిటీ కేసు నమోదు

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: పాతకక్షలతో ఓ యువకుడిపై దాడిచేసిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను శుక్రవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఇల్లెందు మండలం రాగబోయినగూడెంకు చెందిన ఓ పత్రికా విలేకరి (ఈనాడు కాదు) నిట్టా సుదర్శన్ గురువారం రాత్రి జగదాంబగుంపు వద్దనున్న తన మిత్రుడు రాజేశ్ వద్దకు ద్విచక్రవాహనంపై గురువారం రాత్రి వచ్చాడు. ఇల్లెందు నుంచి అనుసరిస్తూ వచ్చిన వంశీ, ప్రేమ్, ఉదయ్‌లు ఆయనతో గొడవపడి మద్యం సీసాలు, కర్రతో దాడిచేసి పారిపోయారు. స్థానికులు సుదర్శన్‌ను '108'లో ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సీఐ సత్యనారాయణ ఆసుపత్రిలో బాధితుడితో మాట్లాడి వివరాలు సేకరించారు. అనంతరం మెరుగైన చికిత్సకోసం కుటుంబ సభ్యులు సుదర్శన్‌ను ఖమ్మంలోని ఆసుపత్రిలో చేర్పించారు. దాడికి పాల్పడిన వారి కోసం గాలిస్తున్నామని, ఘటనపై ఎస్సీ అట్రాసిటీ కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు డీఎస్పీ వెల్లడించారు.

బోనకల్లులో హోటల్ వ్యాపారి రూ.2.75 కోట్లకు ఐపీ

బోనకల్లు, న్యూస్‌టుడే: బోనకల్లులో హోటల్ నిర్వహిస్తున్న రామన నరసింహారావు అనే వ్యక్తి రూ. 2,75,80,182కు ఐపీ దాఖలు చేశాడు. నారాయణపురం గ్రామానికి చెందిన నరసింహారావు కొన్నేళ్లుగా బోనకల్లులో సుధా హోటల్ నిర్వహిస్తున్నాడు. బోనకల్లులో సొంత ఇంటిని నిర్మించుకున్నాడు. బ్యాంకులతోపాటు ప్రైవేటు వ్యక్తుల నుంచి అప్పులు తీసుకున్నారు. హోటల్ వ్యాపారం సరిగా లేకపోవడంతో చేసిన అప్పులకు వడ్డీలు పెరిగాయి. రుణదాతల నుంచి వత్తిడి పెరగడంతో కొన్ని రోజులుగా భార్యాపిల్లలతో సహా కనిపించకుండా పోయాడు. ఈ నేపథ్యంలో రుణదాతలకు ఖమ్మం సీనియర్ సివిల్ జడ్జి కోర్టు నుంచి శుక్రవారం నోటీసులు అందాయి. రామన నరసింహారావు రూ. 1,95,20,683, భార్య రామన సుధారాణి పేరుతో రూ. 80,59,499 ఐపీ దాఖలు చేశారు. మొత్తం 84మందిని ప్రతివాదులుగా చూపారు.

మినీ మైదానం.. మెరుగైన ప్రత్యామ్నాయం

రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు శిక్షణ ఇస్తున్న కల్లూరు స్టేడియం

కల్లూరు, న్యూస్‌టుడే

నియోజకవర్గ స్థాయి మైదానంగా ఊపిరి పోసుకున్న ఆ స్టేడియం తనకున్న ఆధునిక వనరులను సద్వినియోగం చేసుకుని మెరుగైన శిక్షణ ఇస్తోంది. జిల్లా, రాష్ట్ర.. చివరకు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే జట్లకూ శిక్షణ ఇచ్చే ప్రత్యామ్నాయ వేదికగా మారింది. కల్లూరు గ్రీన్‌ఫీల్డ్ మినీ స్టేడియంలో ఇలా శిక్షణ పొందుతున్న విద్యార్థులు పలు విభాగాల్లో రాణిస్తున్నారు.


శిక్షణ పొందిన జాతీయ స్థాయి సబ్ జూనియర్ ఖోఖో క్రీడాకారులతో పీడీలు

కల్లూరు గ్రీన్‌ఫీల్డ్ మినీ మైదానాన్ని అయిదెకరాల విస్తీర్ణంలో గతేడాది, ఏప్రిల్ 29న ప్రారంభించారు. ఔట్‌డోర్‌లో ఫుట్‌బాల్, క్రికెట్, వాలీబాల్ మైదానాలు ఏర్పాటు చేశారు. 400 మీటర్ల స్టాండెడ్ వాకింగ్, రన్నింగ్ ట్రాక్ అందుబాటులోకి తేవటంతో అథ్లెటిక్స్ క్రీడా సాధనకు బాగా ఉపయోగపడుతోంది. ఇండోర్‌లో ఆధునిక సదుపాయాలతో ఖోఖో, కబడ్డీ, షటిల్, బాల్‌బ్యాడ్మింటన్ కోర్టులున్నాయి. మైదానానికి మొత్తం మూడు శాశ్వత పోస్టులుండగా ఒకటి ఖాళీగా ఉంది. విద్యార్థులకు డివిజన్, జిల్లా స్థాయి పోటీల్లో శిక్షణను స్థానిక అసోసియేషన్ల ఆధ్వర్యంలో పీఈటీలు అందిస్తున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించే జట్లు, క్రీడాకారులకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వారు నిర్దేశించిన కోచ్‌లు శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ కాలంలో మైదానంలో 50మందికి సరిపడా ఆవాస సదుపాయం ఉంది. పక్కన ఉండే ప్రభుత్వ పాఠశాల, కళాశాలలను కలిపితే ఆ సంఖ్య 150కి చేరుతుంది.

దాతల చేయూత

పట్టణ పరిధిలోని దాతలు తోపు బండి ఫౌండేషన్ సాధిక్‌అలీ, పీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్టు సహకారంతో శిక్షణ కాలంలో క్రీడాకారులకు భోజన వసతులు, క్రీడా దుస్తులు సమకూర్చుతున్నారు. కొన్ని సందర్భాల్లో పోటీలకు వెళ్లే పేద విద్యార్థులకు రవాణా ఛార్జీలు, కిట్లు వితరణ చేస్తున్నారు.

మైలురాళ్లు..

✦ 2023, మే నెలలో.. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్ 100, 200, 400, 800 మీటర్ల పరుగు, షాట్‌పుట్, లాంగ్‌జంప్, జావెలిన్ త్రో విభాగాల్లో మండల, రీజియన్, జిల్లా స్థాయి క్రీడాకారులకు శిక్షణ ఇచ్చారు. వాలీబాల్, కబడ్డీ జిల్లా జట్టులో ఆడిన క్రీడాకారులు 13మంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

✦ 2023, ఆగస్టు నుంచి నవంబరు వరకు.. జిల్లా స్థాయి చెస్, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలకు శిక్షణ అందించారు.

✦ 2023, 24 సంవత్సరాల్లో ఖోఖో సబ్ జూనియర్ రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ ఏడాది బాలుర జట్టు రజతం సాధించగా, బాలికల జట్టు నాలుగో స్థానంలో నిలిచింది.

✦ క్రీడా పాఠశాల్లో ప్రవేశాలకు సంబంధించిన తర్ఫీదులో కూడా ప్రత్యేక స్థానం సంతరించుకుంది. 2023-24లో మొత్తం 24 మందికి శిక్షణనివ్వగా 15మంది, 2024-25లో 12 మందికి శిక్షణ ఇవ్వగా 8 మంది అర్హత సాధించారు.

'మినీ స్టేడియంలో శిక్షణ పొందినవారు పతకాలు సాధించటం సంతోషంగా ఉంది. భవిష్యత్తులోనూ మంచి శిక్షణ అందిస్తాం.'
– పసుపులేటి వీరరాఘవయ్య, పాలనాధికారి.



'జార్ఖండ్‌లో గత నెల 29 నుంచి ఈ నెల 2వరకు జాతీయ స్థాయి సబ్ జూనియర్ ఖోఖో పోటీలు నిర్వహించారు. కల్లూరులో శిక్షణ తీసుకుని ఈ పోటీల్లో రజత పతకం సాధించాం.'
– మాసయ్య, ములుగు జిల్లా



'ఆసిఫాబాద్ క్రీడా పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నా. ఈ ఏడాది హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ ఖోఖో పోటీల్లో విజేతగా నిలవటంతో, జాతీయ స్థాయికి ఎంపికయ్యా. జాతీయ స్థాయి పోరులో నాలుగో స్థానంలో నిలిచాం. కల్లూరులో శిక్షణ బాగా ఉపయోగపడింది.'
- కుర్రా నాగేశ్వరి, క్రీడాకారిణి.

చికెన్ ధరలు



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 152 చికెన్ విత్ స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ధరలు (రూ.లలో)

పంట పేరు	కనిష్ఠ	గరిష్ఠ	నమూనా
కొత్తపత్తి	5,500	7,000	6,800
పాతపత్తి	7,100	7,300	7,200
పెసలు	5,100	7,225	6,300
ఏసీ ఎండుమిరప	10,400	19,000	16,000
ఎండుమిరప	9,500	16,400	15,000
ఏసీతాలుమిరప	9,300	9,500	9,300
తాలుమిరప	9,000	9,000	9,000

సత్తుపల్లి

•సత్తుపల్లి •మధిర • వైరా



సీఎంను కలిసిన ఎమ్మెల్యే

వైరా, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో కీలకమైన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. కారేపల్లి మండలానికి సింగరేణి నుంచి రావాల్సిన అభివృద్ధి నిధులతో పాటు సీతారామ ప్రాజెక్టు నుంచి రాజీవ్‌గాంధీ లింక్ కెనాల్‌కు భూములు అందించిన రైతులకు పరిహారం అందించాలని కోరారు. ఇతర అంశాలపై చర్చించారు.

హుండీ ఆదాయం రూ.88,322



మధిర, న్యూస్‌టుడే: మధిర ప్రధాన వీధిలోని శ్రీసిద్ధివిఘ్నేశ్వర ఆలయం హుండీ ఆదాయాన్ని దేవాదాయ శాఖ పరిశీలకుడు ఎం.అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం లెక్కించారు. ఆదాయం రూ.88,322 వచ్చినట్లు తెలిపారు. ఈఓ సీహెచ్ రామకోటేశ్వరరావు, అర్చకులు హరి రవిశాస్త్రి పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) సత్తుపల్లి : 93922 39905 మధిర : 98668 05652 వైరా : 76619 46938

సమస్య: కల్లూరు పట్టణ పరిధిలోని మధిర వీధిలో మురుగు నీరు సాగర్ కాల్వలో కలిసిపోతోంది. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి. - పాఠకులు

సమాధానం: మురుగు నీటికి ప్రత్యేకంగా పైపులు ఏర్పాటు చేస్తాం. వేరే ప్రాంతానికి తరలిస్తాం. - నందిశెట్టి నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి

– కల్లూరు, న్యూస్‌టుడే

కారేపల్లిలోని పలు కూడళ్లలో చెత్త సేకరణ జరగడం లేదు. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. స్థానికుడు

✔ తక్షణమే సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటాం.

- నవీన్, పంచాయతీ కార్యదర్శి

– కారేపల్లి, న్యూస్‌టుడే

జలాశయం వెళ్లే మార్గంలో కుడి కాలువ వద్ద తీవ్ర అపరిశుభ్రంగా ఉంది. చెత్త వేస్తున్నారు. - జాని

✔ శుభ్రం చేయించేలా తక్షణ చర్యలు తీసుకుంటాం. - కమిషనర్, వేణు

– వైరా, న్యూస్‌టుడే



బోనకల్లులోని వ్యాపారులు, మాంసం దుకాణదారులు వ్యర్థాలను జగ్గయ్యపేట రహదారి పక్క వేస్తుండటంతో ఇబ్బందిపడుతున్నామని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరి వ్యర్థాలను తొలగించారు. – బోనకల్లు, న్యూస్‌టుడే

సత్తుపల్లి డిపోకు రికార్డు స్థాయి ఆదాయం

సత్తుపల్లి, న్యూస్‌టుడే: డిపో చరిత్రలో ఎన్నడూలేని విధంగా సత్తుపల్లి ఆర్టీసీ డిపోకు గురువారం రికార్డు స్థాయిలో రూ.33,58,658 ఆదాయం వచ్చినట్లు డీఎం యు.రాజ్యలక్ష్మి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. దసరా సందర్భంగా డిపోలో ఈ నెల 1నుంచి 16వరకు రెగ్యులర్ బస్సులు కాకుండా అదనంగా 190 స్పెషల్ బస్సులను నడపగా రూ.80,83,781 ఆదాయం వచ్చినట్లు డీఎం వివరించారు. డ్రైవర్లు, కండక్టర్లు, ఉద్యోగులను డీఎం ప్రత్యేకంగా అభినందించారు.

యూటీఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక



వీరస్వామి, ప్రసాదరావు

కొణిజర్ల, న్యూస్‌టుడే: యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నికను శుక్రవారం కొణిజర్లలో జరిపించారు. అధ్యక్షుడిగా అమ్మపాలెంకు చెందిన చిలుకూరి వీరస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా మాదాల ప్రసాదరావు, కోశాధికారిగా నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా రత్నసుశీలరాణి, శ్రీనివాస్‌తోపాటు కార్యదర్శులు, జిల్లా ప్రతినిధులను ఎన్నుకున్నారు.

శిక్షణ.. రక్షణ..

మహిళా సాధికారత కోసం స్వయం ఉపాధి శిక్షణ

చింతకాని, న్యూస్‌టుడే

మహిళలతో వస్త్ర పరిశ్రమలు ఏర్పాటు చేయించి వారు స్వశక్తితో ఎదిగేందుకు దోహదపడేలా ఎస్‌బీఐ-గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలు సంయుక్తంగా శిక్షణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. మగ్గం వర్క్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, శారీ పెయింటింగ్, జనపనార సంచుల తయారీ, పర్సులు, లగేజీ సంచుల రూపకల్పనపై స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా-గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ(ఎస్‌బీఐఆర్‌ఎస్‌ఈటీఐ) ఆధ్వర్యంలో చింతకాని మండలం నాగులవంచ, చింతకాని ఐకేపీ కార్యాలయంలో కొన్ని రోజులుగా శిక్షణ ఇస్తున్నారు. నాగులవంచలో సెప్టెంబరు 11 నుంచి 23వరకు శిక్షణ పూర్తికాగా, చింతకానిలో సెప్టెంబరు 22న ప్రారంభమైన శిక్షణ అక్టోబరు 24తో ముగిస్తుంది. సుశిక్షితులైన మహిళలు ఇంట్లోనే మగ్గం వర్క్ యూనిట్ నెలకొల్పితే రోజుకు రూ.వెయ్యి నుంచి రూ.1500 ఆదాయం చేకూరుతుందని నిర్వాహకులు తెలిపారు.



చింతకానిలో మగ్గం వర్క్‌లో శిక్షణ పొందుతున్న మహిళలు

ఇదీ లక్ష్యం..

➡ ప్లాస్టిక్ ఉత్పత్తులను నివారించే క్రమంలో భాగంగా ప్రత్యామ్నాయంగా జనపనారతో చేసే బ్యాగులు, లగేజీ, మార్కెట్ సంచుల తయారీకి ప్రాధాన్యం ఇస్తూ.. మహిళలకు ఉచిత శిక్షణ అందించటం.

➡ శిక్షణ కాలంలో ఏకరూప డ్రస్, మధ్యాహ్న భోజనం, టీ, స్నాక్స్, వసతిని ఎస్‌బీఐ ఆధ్వర్యంలో అందజేస్తున్నారు.

➡ శిక్షణ ఇచ్చే వారికి గౌరవ వేతనం సమకూరుస్తున్నారు.

శిక్షణార్థులకు బహుళ ప్రయోజనాలు

★ వస్త్ర చిత్రకళా ఉద్యమి ఆధ్వర్యంలో 30 రోజులు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ధ్రువీకరణ పత్రాన్ని నిర్వాహకులు అందజేస్తారు.

★ ఆ సర్టిఫికెట్‌తోపాటు ఉచిత టూల్ కిట్, మగ్గం, ఫ్రేమ్‌లను ఉచితంగా అందిస్తారు. కోర్సు పూర్తి చేసుకున్నవారు ఇళ్లలోనే మగ్గం వర్క్‌తోపాటు, కంప్యూటర్ ఎంబ్రాయిడరీ, డిజైన్ మెటీరియల్స్‌ను తయారు చేసుకోవచ్చు.

★ నేషనల్ సర్టిఫికెట్ ఉన్నవారికి ముద్రా లోన్‌ను కూడా బ్యాంకర్ల ద్వారా ఇప్పించే వెసులుబాటు ఉంది.

స్వతహాగా ఎదిగేందుకే..: తడికమళ్ల రమణ, నరసింహాపురం



గతంలో టైలరింగ్‌లో అనుభవం ఉంది. మగ్గం వర్క్ మీద శ్రద్ధతో చింతకానిలో శిక్షణ పొందుతున్నా. కుందన్, పైపింగ్, పూసలు, దారాలు, చమ్కీలు, మగ్గం వర్క్‌పై ట్రైన్ చేశారు. స్వశక్తితో ఇంట్లోనే మగ్గం వర్క్‌ను ఏర్పాటు చేసి స్వతహాగా ఎదగాలన్నదే లక్ష్యం.

శిక్షణ ఉపయోగపడింది: జె.మమత, చింతకాని



వస్త్ర చిత్రకళా ఉద్యమి ఆధ్వర్యంలో విజయభారతి మహిళా మండలి ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రం ఎంతో ఉపయోగపడింది. మగ్గం వర్క్, ఎంబ్రాయిడరీ నేర్చుకుని ఓ దుకాణం ఏర్పాటు చేసుకుంటాను. గతంలో నాకు టైలరింగ్‌లో ప్రావీణ్యం ఉంది.

మెరుగైన మార్గం..: ఎస్‌కే జెరీనా, వైఎస్ఆర్ కాలనీ, ఖమ్మం



మగ్గం వర్క్‌పై శ్రద్ధతో రోజూ ఖమ్మం నుంచి వచ్చి నేర్చుకుంటున్నా. నాకు ఇంట్లో కిరాణా షాపు ఉంది. దాని మీద ఆదాయం అంతంతగా వస్తోంది. మగ్గం వర్క్ నేర్చుకుంటే ఖర్చులు పోను రూ.వెయ్యి సంపాదించే అవకాశం ఉంది.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

బోనకల్లు, న్యూస్‌టుడే: మండలంలోని 40 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కుల్ని తహసీల్దార్ పున్నం చందర్ శుక్రవారం అందజేశారు. కాంగ్రెస్ నాయకులు చేబ్రోలు వెంకటేశ్వరరావు, పాసంగుల కోటేశ్వరరావు, సీపీఎం నాయకుడు గుగులోతు పంతునాయక్ పాల్గొన్నారు.



చెక్కుల్ని పంపిణీ చేస్తున్న తహసీల్దార్ పున్నం చందర్

ఎంపీడీవో బదిలీ



ఆర్.చిననాగేశ్వరరావు

వేంసూరు, బోనకల్లు, న్యూస్‌టుడే: వేంసూరు ఎంపీడీవో రమాదేవి బోనకల్లుకు బదిలీ అయ్యారు. సత్తుపల్లి ఎంపీడీవో ఆర్.చిననాగేశ్వరరావు శుక్రవారం వేంసూరు ఇన్‌ఛార్జి బాధ్యతలు స్వీకరించారు. ఆయన వేంసూరు ఎంపీవోగా ఏడేళ్లు పనిచేశారు. అదే సందర్భంలో బోనకల్లు ఎంపీడీఓగా రురావత్ రమాదేవి బాధ్యతలు స్వీకరించారు. ఎల్.రాజు ఆగస్టులో ఉద్యోగ విరమణ చేసినప్పటి నుంచి సూపరింటెండెంట్ రవికుమార్ ఇన్‌ఛార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

రహదారి పనులు ప్రారంభం

చింతకాని, న్యూస్‌టుడే: నాగులవంచ నుంచి ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా పోలంపల్లి వరకు రూ.5 కోట్లతో చేపట్టిన రహదారి నిర్మాణ పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అంబటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

'వంతెన నిర్మాణం పూర్తిచేయాలి'

ముదిగొండ, న్యూస్‌టుడే: ముదిగొండ- వల్లభి రహదారిలో చిరుమర్రి తాళ్లబంధం వాగుపై బ్రిడ్జి నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని తెలంగాణ రైతుసంఘం, సీపీఎం నాయకులు శుక్రవారం ధర్నా చేపట్టారు. పనులు పూర్తికాక వాహనదారులు ఇబ్బంది పడుతున్నారన్నారు. రైతుసంఘం మండల కార్యదర్శి ఉపేందర్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

కేజీబీవీని పరిశీలించిన జీసీడీఓ

ఎర్రుపాలెం, న్యూస్‌టుడే: ఎర్రుపాలెంలోని కేజీబీవీని జీసీడీఓ తులసి శుక్రవారం సందర్శించారు. పాఠశాలలో మరమ్మతులను పరిశీలించారు. వారం రోజుల్లో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థినులతో మాట్లాడారు. ఎస్‌ఓ కె.సరిత, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన

కల్లూరు: పుల్లయ్యబంజర్‌లో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న ఎస్డీ వజీర్‌మియా కుమారుడు వసీముద్దీన్ రామగుండం ప్రభుత్వ సింగరేణి కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించాడు. పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, శుక్రవారం వజీర్‌మియాను శాలువాతో సత్కరించారు.

సమాచారం లేకుండా కోనోకార్పస్ చెట్ల తొలగింపు



మధిర గ్రామీణం, న్యూస్‌టుడే: అధికారులకు సమాచారం లేకుండా ఆత్కూరు గ్రామంలో శుక్రవారం ప్రధాన రహదారి పక్కన ఉన్న కోనోకార్పస్ చెట్లను తొలగించారు. అధికారులు ఘటనా స్థలికి చేరుకుని ప్రశ్నించారు. మున్సిపాలిటీ పరిధిలో చెట్ల తొలగింపునకు అనుమతులున్నాయని, ఆత్కూరు పంచాయతీ పరిధిలోనిదని తెలియక తొలగించామని సమాధానమిచ్చారు. పంచాయతీ కార్యదర్శి భాస్కర్‌రావు మాట్లాడుతూ సమాచారం లేకుండా చెట్లను తొలగించిన వారికి జరిమానా విధిస్తామన్నారు.

26న మాదిగ సమ్మేళనం

వైరా, న్యూస్‌టుడే: నియోజకవర్గ స్థాయి మాదిగ సమ్మేళనం ఈనెల 26న నిర్వహిస్తున్నట్లు మాదిగ జేఏసీ జిల్లా ఇన్‌ఛార్జి మట్టె గురుమూర్తి పేర్కొన్నారు. వైరాలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం కొంతమంది జాతి ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తున్నారన్నారు. జేఏసీ రాష్ట్ర కన్వీనర్ కె.ధీరన్, రాష్ట్ర కార్యదర్శి మురళి, వెంకటరాములు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థికి చేయూత

వైరా, న్యూస్‌టుడే: గ్రేటు విజన్ క్లబ్ అధ్యక్షుడు తోటకూర శ్రీకాంత్ ఆధ్వర్యంలో మెడిసిన్ విద్యార్థి మాగంటి మధురకు రూ.10 వేలను శుక్రవారం అందించారు. డాక్టర్ కాపా మురళీకృష్ణ, మన్నెం కృష్ణ చేయూత అందించారు.

పంటల పరిశీలన

కారేపల్లి, న్యూస్‌టుడే: గేటురేలకాయలపల్లిలో పత్తి, మిరప పంటలను వైరా కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డా.రవికుమార్, శాస్త్రవేత్త పీఎస్ఎం ఫనిశ్రీ, ఏడీఏ కరుణ బృందం శుక్రవారం పరిశీలించారు. ఏవో బి.అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గం

ఏన్కూరు, న్యూస్‌టుడే: పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గం ఎన్నిక శుక్రవారం ఏన్కూరులో జరిగింది. మండల అధ్యక్షుడిగా బాణోత్ రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా కంచర్ల కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా కొండ్రు మాధవి, కోశాధికారిగా పోలగాని భార్గవ్, గౌరవ అధ్యక్షుడిగా రామ్‌కి, మహిళా అధ్యక్షురాలిగా గొడ్ల మౌనిక, నిర్వహణ కార్యదర్శిగా లకావత్ సురేశ్, మరో 17 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఎంపీడీవో ఎస్.రమేశ్, ఎంపీవో జీవీఎస్ నారాయణలను మర్యాదపూర్వకంగా కలిశారు.



ఎంపీడీవో, ఎంపీవోలతో నూతన కార్యవర్గ సభ్యులు

ప్రతిభ చాటి... బహుమతులు సాధించి

స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో శుక్రవారం ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగంతో లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో 8వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. ప్రథమ స్థానంలో తొమ్మిదో తరగతి విద్యార్థి ఎ.పోతురాజు, ద్వితీయ స్థానంలో ఎనిమిదో తరగతి విద్యార్థి పి.అఖిల్, తృతీయ స్థానంలో జి.సుశాంత్‌లు నిలిచారు. హెచ్‌ఎం యాకోబు విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలందించారు.

★ స్థానిక కేపీఆర్ స్కూల్లో ఇదే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రథమ స్థానంలో 9వ తరగతి విద్యార్థిని బి.రమ్య, ద్వితీయ స్థానంలో పదో తరగతి విద్యార్థిని ఎ.భవిత, తృతీయ స్థానంలో ఎస్‌కె.అఫీఫాలు నిలిచారు. ప్రిన్సిపల్ కిరణ్ విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలందించారు. – సత్తుపల్లి, న్యూస్‌టుడే



సత్తుపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో విజేతలకు బహుమతులందిస్తున్న హెచ్‌ఎం యాకోబ్



కేపీఆర్ స్కూల్లో విజేతలకు బహుమతులందిస్తున్న ప్రిన్సిపల్ కిరణ్, ఉపాధ్యాయులు

'కాంగ్రెస్ ప్రభుత్వంతోనే ప్రగతి సాధ్యం'

సత్తుపల్లి, న్యూస్‌టుడే: అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. రుద్రాక్షపల్లిలో సింగరేణి సాయంతో రూ.75లక్షల విలువైన 30 సోలార్ మోటార్లను రైతులకు శుక్రవారం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సత్తెంపేట, బాసారం, కొమ్ముగూడెం, రుద్రాక్షపల్లికి చెందిన రైతులు ఐటీడీఏ అనుమతితో ఏర్పాటు చేసిన బోర్లలో కొన్ని పనిచేయటం లేదని, రైతుల విజ్ఞప్తి మేరకు రూ.2.5 లక్షల సోలార్ మోటారును పంపిణీ చేశామని తెలిపారు. భారాస చేస్తున్న విమర్శల్లో వాస్తవాలు లేవని, పదేళ్ల పాలనలో ఆ ప్రభుత్వం ఎంత మందికి రుణమాఫీ చేసిందో ప్రజలకు తెలుసన్నారు. ఎంపీడీఓ నాగేశ్వరరావు, డాక్టర్ మట్టా దయానంద్, రుద్రాక్షపల్లి ప్రత్యేక అధికారి శ్రీధర్, కార్యదర్శి సురేశ్‌రెడ్డి, చల్లగుళ్ల నరసింహారావు, భరత్, నరేంద్రరెడ్డి పాల్గొన్నారు.

★ స్థానిక మున్సిపల్ కార్యాలయాన్ని శుక్రవారం ఎమ్మెల్యే మట్టా రాగమయి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్ని విభాగాల గదులకు వెళ్లి సంబంధిత రికార్డులను పరిశీలించారు. హాజరు పట్టిక ప్రకారం అందరూ విధులకు హాజరయ్యారా లేదా అని ఆరాతీశారు. కమిషనర్ ఎం.రవిబాబుతో పలు అంశాలపై చర్చించారు. కౌన్సిలర్లు దూదిపాల రాంబాబు, మందపాటి పద్మజ్యోతి పాల్గొన్నారు.



సోలార్ మోటార్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి, తదితరులు

చికిత్స పొందుతూ యువకుడు మృతి

కొణిజర్ల, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న యువకుడు శుక్రవారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం... ఈనెల 16న తనికెళ్లకు చెందిన చల్లా శివకుమార్(27) ఇంటి వద్ద నుంచి ద్విచక్ర వాహనంపై వైరా వెళ్తుండగా కొణిజర్ల, పల్లిపాడు మధ్య గుంతను తప్పించబోయి ప్రమాదానికి గురయ్యాడు. తలకు బలమైన గాయం కావడంతో హైదరాబాద్ తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య యశోద, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

వృద్ధురాలిని బెదిరించి గొలుసు చోరీ

వేంసూరు, న్యూస్‌టుడే: మర్లపాడులో ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలిని బెదిరించి బంగారు గొలుసు అపహరించిన ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. రమణమ్మ కొంతకాలంగా ఇంట్లో ఒంటరిగా ఉంటోంది. గురువారం రాత్రి 1.30 సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి వచ్చి రమణమ్మను బెదిరించి, ఆమె కేకలు వేయకుండా నోట్లో వస్త్రం కుక్కారు. వృద్ధురాలిని కొట్టి మెడలో ఉన్న బంగారు గొలుసు లాక్కుని వెళ్లారు. కుమారుడు సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

ముదిగొండ, న్యూస్‌టుడే: వల్లభి నుంచి ఖమ్మానికి ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను సువర్ణాపురం క్రాస్ రోడ్డు వద్ద శుక్రవారం పట్టుకున్నట్లు ముదిగొండ సీఐ మురళి తెలిపారు. డ్రైవర్లు, యజమాని, వల్లభిలో ఇసుక అక్రమంగా నిల్వచేసిన వ్యక్తి.. మొత్తం నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

జ్వరంతో మృతి

వైరా, న్యూస్‌టుడే: జ్వరంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన వైరాలో శుక్రవారం జరిగింది. స్థానికుడైన తల్లపురెడ్డి సత్యనారాయణ రెడ్డి(70) కొద్ది రోజులుగా గన్యాతో బాధపడుతూ తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ.. మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

'హైడ్రా పేరుతో పక్కదోవ పట్టించే యత్నం'



మాట్లాడుతున్న జడ్పీ మాజీ ఛైర్మన్ లింగాల కమల్‌రాజు

బోనకల్లు, న్యూస్‌టుడే: హైడ్రా పేరుతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరు గ్యారెంటీలను ప్రజలకు అందించకుండా పక్కదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నాడని మాజీ జడ్పీ ఛైర్మన్ లింగాల కమల్‌రాజు విమర్శించారు. శుక్రవారం బోనకల్లు భారాస కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 లక్షల రుణమాఫీ అని 30శాతం మందికి కూడా అందించలేదన్నారు. ఆగస్టు 15నాటికి పూర్తి స్థాయిలో మాఫీ అని చెప్పిన ముఖ్యమంత్రి, అక్టోబరు 15 దాటినా చేయలేకపోయారన్నారు. తుపానుతో నష్టపోయిన రైతులకు పరిహారం అందలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలు బతుకమ్మ పండుగ జరుపుకోలేకపోయారని అన్నారు. పార్టీ మండల కార్యదర్శి మోదుగుల నాగేశ్వరరావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు బానోతు కొండ, మండల నాయకులు వేమూరి ప్రసాద్, పారా ప్రసాద్, కొమ్మినేని ఉపేందర్, ముదావత్ సైదా పాల్గొన్నారు.

'పార్టీ సభ్యత్వ నమోదులో ముందుండాలి'



సభ్యత్వ నమోదులో నంబూరి రామలింగేశ్వరరావు

తల్లాడ, న్యూస్‌టుడే: భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదులో ముందుండాలని ఆ పార్టీ పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు అన్నారు. మల్లవరంలో శుక్రవారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. నంబూరి మాట్లాడుతూ ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా 30లక్షల సభ్యత్వాలు నమోదయ్యాయని, జిల్లాలో ఆ సంఖ్య 50 వేలు అన్నారు. కార్యక్రమంలో గాదె కృష్ణారావు, శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

ఏడేళ్లుగా మంచానికే పరిమితం..

శాశ్వత వికలాంగుడిగా ధ్రువీకరణ పొందినా నేటికీ అందని పింఛన్

మానవీయం

మధిర, న్యూస్‌టుడే

కూలి పనికి వెళ్తేనే రోజుగడిచే పరిస్థితి ఆ కుటుంబానిది. సాయంత్రం పూట తాను నివసిస్తున్న ఇంటిపైకి వెళ్లి కిందకు దిగే సమయంలో ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. వెన్నెపూసకు బలమైన దెబ్బ తగలటంతో రెండు కాళ్లు చచ్చుబడ్డాయి. ఏడేళ్లుగా మంచానికే పరిమితమైన అతను దివ్యాంగ పింఛన్ కోసం నిరీక్షిస్తున్నారు.

మధిర మున్సిపాలిటీ పరిధిలోని మడుపల్లి శివారు అన్నాయపాలేనికి చెందిన కమ్మంపాటి చిన్న ప్రభాకర్(54) బ్యాండ్‌మేళం వాయిస్తూ జీవనం సాగించేవారు. భార్య కూలీ పనులకు వెళ్తూ కుటుంబానికి ఆదరువుగా ఉంటుంది. వీరికి ముగ్గురు సంతానం. ఏడేళ్ల క్రితం ఓ రోజు ప్రభాకర్ ప్రమాదవశాత్తు గోడలేని డాబాపై నుంచి పడిపోయాడు. పలుచోట్ల వైద్య చికిత్సలు చేయించినా ఫలితం లేకపోయింది. రెండు కాళ్లు పనిచేయవని వైద్యులు నిర్ధారించారు. మూత్ర విసర్జన కూడా వెళ్లే పరిస్థితి లేక యూరినరీ ట్రాక్ వేశారు. వారానికోసారి దీన్ని మార్చాల్సి వస్తుంది. ఇద్దరు కుమారులకు వివాహాలయ్యాయి. వేరుగా ఉంటున్నారు. భార్య, చిన్న కుమారుడు ఇతని బాగోగులు చూస్తున్నారు. వీరిలో ఒకరు కూలి పనులకు వెళ్తే మరొకరు సపర్యలు చేసేందుకు ఉండాల్సి వస్తుంది.



కమ్మంపాటి చిన్న ప్రభాకర్

ఏళ్లుగా నిరీక్షణ..

రెండేళ్ల క్రితం సదరం శిబిరంలో ఇతనికి శాశ్వత వైకల్య ధ్రువీకరణ పత్రం అందించారు. వికలాంగ పింఛన్ కోసం దరఖాస్తు చేసినా మంజూరు కాలేదు. జిల్లా అధికారులకు సైతం సమస్య వివరించినా ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు దివ్యాంగ పింఛను మంజూరు చేయాలని కోరుతున్నారు.

బుగ్గపాడులో అయ్యప్ప పడిపూజ

సత్తుపల్లి, న్యూస్‌టుడే: బుగ్గపాడులోని విశ్వధర్మక్షేత్రం(శివాలయం) ప్రాంగణంలో శుక్రవారం రాత్రి అయ్యప్పస్వామి మహాపడిపూజ నిర్వహించారు. వెల్లటూరి ప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన పూజకు సత్తుపల్లి, చుట్టుపక్కల గ్రామాల నుంచి అయ్యప్ప భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. హైదరాబాద్ భజనమండలి వారు గానం చేసిన భజన పాటలు గ్రామంలో మార్మోగాయి.



శివాలయం ప్రాంగణంలో నిర్వహిస్తున్న మహాపడిపూజ

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం



సత్తుపల్లి, న్యూస్‌టుడే: గౌరిగూడెం సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8.30 నుంచి 11.30 వరకు గౌరిగూడెం, కొత్తూరు, రేజర్ల, సర్వరాయ, సిద్ధారం, రాజీవ్‌నగర్‌లో విద్యుత్తు సరఫరా ఉండదని ఏఈ శరత్ ఓ ప్రకటనలో తెలిపారు.

ముదిగొండ, న్యూస్‌టుడే: కొత్తలక్ష్మీపురం విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం వాటిల్లుతుందని ఏడీఈ రామకృష్ణారావు ఓ ప్రకటనలో తెలిపారు.

పెనుబల్లి, న్యూస్‌టుడే: పెనుబల్లి 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా ఈ నెల 19న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1.30 గంటలకు వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ రవితేజ ఓ ప్రకటనలో తెలిపారు. వీఎం బంజర్, పెనుబల్లి, రామచంద్రారావు బంజర్, రంగారావు బంజర్, సీతారాంపురం, ఎడ్లబంజర్, బయ్యన్నగూడెం, నాయకులగూడెం, మొండికుంట, మండాలపాడు గ్రామాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం వాటిల్లుతుందన్నారు.

ముదిగొండ, న్యూస్‌టుడే: బాణాపురం విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో శనివారం ఉదయం 10 నుంచి 12గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం వాటిల్లుతుందని ఏడీఈ రామకృష్ణారావు ఓ ప్రకటనలో తెలిపారు.

తల్లాడ, న్యూస్‌టుడే: మిట్టపల్లి విద్యుత్తు సబ్ స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా మిట్టపల్లి, నూతనకల్, వెంగన్నపేట, రంగంబంజర, నారయ్యబంజర, మల్సూర్‌తండా, రామానుజవరం, లక్ష్మీపురం, పినపాక, వెంకటాపురం గ్రామాలకు శనివారం ఉదయం 9.30 నుంచి 11గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్టు కుర్నవల్లి ఏఈ డి.కృష్ణకాంత్ శుక్రవారం తెలిపారు.

విద్యాభివృద్ధికి సింహాచలం..

ఏన్కూరు, న్యూస్‌టుడే



సింహాచలం

ఆయన ఎక్కడ పని చేసినా ఆ విద్యాలయం అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తారు. తానో సైనికుడిగా కళాశాలను అన్ని రంగాల్లో ముందంజలో నిలుపుతున్నారు. ఆయనే ఏన్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రధానాచార్యులు మీటకోటి సింహాచలం. 1998లో హిందీ అధ్యాపకుడిగా కూనవరంలో ఉద్యోగంలో చేరిన ఆయన హిందీ సాహిత్యంలో అనేక రచనలు రాశారు. ఆ సబ్జెక్టులో విద్యార్థులు ప్రావీణ్యం పెంపొందే విధంగా కృషి చేశారు. కల్లూరు, ఖమ్మంలో పనిచేసి 2012లో ప్రధానాచార్యులుగా పదోన్నతి పొందారు. జగిత్యాల జిల్లా రాయకల్ నుంచి 2016లో కారేపల్లి కళాశాలకు బదిలీపై వచ్చారు. ఈ ఏడాది ఆగస్టులో ఏన్కూరు కళాశాలకు బదిలీ అయ్యారు. కళాశాలల్లో విద్యాప్రమాణాలు పెంచేందుకు ఆయన చేపట్టిన కార్యక్రమాలకు జిల్లా ఉత్తమ ప్రధానాచార్యులుగా అప్పటి రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ నుంచి పురస్కారం అందుకున్నారు. ఈ ఏడాది సెప్టెంబర్ 5న రాష్ట్రస్థాయి అవార్డు మంత్రి పొన్నం ప్రభాకర్ నుంచి స్వీకరించారు. రాష్ట్రంలో నలుగురు ఉత్తమ ప్రధానాచార్యులను ఎంపిక చేయగా అందులో సింహాచలం ఒకరు కావడం విశేషం..

విశేష సేవలు



మంత్రి పొన్నం ప్రభాకర్ నుంచి పురస్కారం అందుకుంటున్న సింహాచలం(ఎడమవైపు)

కారేపల్లిలో 2016 నుంచి 2024 వరకు పని చేసిన సింహాచలం ఆ కళాశాల రూపురేఖలు మార్చారు. ప్రధానాచార్యులుగా తనమార్కు చూపిస్తూ ప్రభుత్వ కళాశాలలో 400 ప్రవేశాలు చేసి అధికారులతో గుర్తింపు పొందారు. కారేపల్లితోపాటు కామేపల్లి, గార్ల, ఇల్లెందు మండలాల నుంచి కూడా విద్యార్థులు అక్కడ చదివే విధంగా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల చొరవతో వసతిగృహాలు ఏర్పాటు చేయించారు. కార్పొరేటు కళాశాలలకు దీటుగా ప్రత్యేక తరగతులు నిర్వహణ, డ్రెస్‌కోడ్ నిర్వహించారు. వసతిగృహాలు ఏర్పాటుకు తోడ్పటమే కాకుండా అక్కడ వెళ్లి రాత్రి తరగతులు నిర్వహణ పర్యవేక్షణ చేస్తూ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించే విధంగా కృషి చేశారు. విద్యార్థులకు ఉపయోగపడే విధంగా వరంగల్ కారాగారం నుంచి 250 బల్లాలు తీసుకొచ్చారు. సింగరేణి కాలరీస్ సీఎండీ బలరాంనాయక్ చొరవతో కళాశాల మరమ్మతులు చేయించారు.

ఖమ్మం

• ఖమ్మం • పాలేరు

సౌత్‌జోన్ అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన వైశాలి



ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే: ఏడు దక్షిణాది రాష్ట్రాలకు చెందిన జట్లు పాల్గొనే సౌత్‌జోన్ అథ్లెటిక్స్ పోటీలు శుక్రవారం గుంటూరులో జరిగాయి. రాష్ట్ర జట్టుకి ప్రాతినిధ్యం వహించిన ఖమ్మం అథ్లెట్ బి. వైశాలి అండర్ 16 విభాగంలో రెండు స్వర్ణాలు గెలుపొందింది. ఉత్తమ జాతీయ క్రీడాకారులు రంగంలోకి దిగిన పెంటథ్లాన్ అంశంలో వైశాలి 3,793 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. డీవైఎస్‌ఓ సునీల్‌రెడ్డి, జిల్లా అథ్లెటిక్ సంఘం సభ్యులు క్రీడాకారిణిని అభినందించారు.

మార్కెట్ నిర్మాణ పనులు పూర్తి చేయండి

ఖమ్మం గ్రామీణం: మద్దులపల్లి మార్కెట్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని మార్కెట్ ఛైర్మన్ బైరు హరినాథ బాబు అన్నారు. పాలకవర్గ సమావేశం మార్కెట్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. పనులు త్వరగా పూర్తిచేయాలని తీర్మానించారు. వైస్ ఛైర్మన్ నరేందర్ రెడ్డి, మార్కెటింగ్‌శాఖ జిల్లా అధికారి ఎంఏ ఆలీమ్, డీఈఈ ఎల్లేశ్, కార్యదర్శి ఆంజనేయులు, పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఖమ్మం: 80085 52623, 91541 18165
రఘునాథపాలెం: 8008573674
పాలేరు: 97010 67081

సమస్య: పంపింగ్‌వెల్ రోడ్డులోని మురుగు కాలువల్లో పూడిక తీయకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. **- సూర్య ప్రకాశ్‌రావు**

సమాధానం: పరిశీలించి తొలగిస్తాం.
- మల్లయ్య, జవాన్
ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే

స్పందనకు స్పందన



నగరంలోని బుర్హాన్‌పురంలో మురుగు కాలువలో చెత్త తొలగించకపోవడంతో మురుగు రహదారిపై పారుతోందని స్థానికులు 'మేమున్నాం.. మీకుతోడు'గా దృష్టికి తెచ్చారు. సమస్యను జవాన్ దృష్టికి తీసుకెళ్లగా పూడిక తీయించారు.

ఖమ్మం జోన్ విజేత ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ జట్టు



విజేత జట్టు

ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే: డిగ్రీ కళాశాలల ఖమ్మం జోన్ క్రికెట్ పోటీలు శుక్రవారం ఖమ్మంలో ముగిశాయి. ఫైనల్ మ్యాచ్‌లో ఖమ్మం ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాల జట్టు విజేతగా నిలవగా కవితా మెమోరియల్ డిగ్రీ కళాశాల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. అనంతరం జరిగిన కార్యక్రమంలో కేఎండీసీ ప్రిన్సిపల్ డా.కె.వి రమణారావు, క్రీడల సమన్వయకర్త డా.బి.వెంకన్న విజేతలకు బహుమతులు అందజేశారు. పీడీలు రఘునందన్, విల్సన్, ఉపేందర్ పాల్గొన్నారు.

టీటీ జట్టు సిద్ధం: రాష్ట్రస్థాయి అండర్ 17 టేబుల్ టెన్నిస్ బాలబాలికల జట్లను శుక్రవారం ఖమ్మం పటేల్ స్టేడియంలోని టీటీ శిక్షణా ప్రాంగణంలో నిర్వహించారు. 90 మంది బాలబాలికలు పాల్గొనగా వారికి పోటీలు నిర్వహించి క్రీడా జట్లను ఎంపిక చేశారు. బాలుర జట్టులో పి.జ్వలిత్, ఫజల్, రామ్‌సాకేత్, హితేశ్ ఉన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే: అండర్ 23 ఉమ్మడి ఖమ్మం జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక నిమిత్తం జిల్లా క్రికెట్ సంఘం శుక్రవారం ఖమ్మం పటేల్ స్టేడియంలో లీగ్ మ్యాచులు ప్రారంభించింది. ఇప్పటికే నిర్వహించిన ప్రాథమిక ఎంపికల ప్రక్రియలో ప్రతిభ చూపిన 72 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. వారిని ఆరు జట్లుగా విభజించి లీగ్ మ్యాచులు నిర్వహిస్తున్నారు. ప్రతిభ ఆధారంగా ఉమ్మడి జిల్లా జట్టును ఎంపిక చేసి హెచ్‌సీఏ నిర్వహించే అండర్ 23 లీగ్స్‌కు పంపుతామని కార్యదర్శి చేకూరి వెంకట్ చెప్పారు. ఫారూఖ్, సీనియర్ క్రికెటర్లు తోడ్పాటునందించారు.

నవంబరు 5న గిరిజన సమ్మేళనం

ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే: నవంబరు 5వ తేదీన ఖమ్మంలో నిర్వహించనున్న గిరిజన సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ శ్రీరామ్‌నాయక్ అన్నారు. సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని కోరుతూ పెద్దతండా, నడిమితండా, చిన్నతండాల్లో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వీరభద్రం, రామ్మూర్తినాయక్, గన్యానాయక్ పాల్గొన్నారు.

ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ..!



ఖమ్మం జిల్లా రవాణా శాఖ కార్యాలయ ప్రాంగణంలో తుప్పు పడుతున్న పాత వాహనాలు

ఖమ్మం జిల్లా రవాణా శాఖ అధికారులకు పట్టుబడిన వాహనాలు తప్పుపట్టి పాడైపోతున్నాయి. ఏళ్లుగా కార్యాలయ ప్రాంగణంలోనే ఉండటంతో ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయి. పోలీసులు, ఆబ్కారీ, రవాణా శాఖ అధికారులు తనిఖీలు చేపట్టిన సందర్భంలో, వివిధ కేసుల్లో ×పట్టుబడిన వాహనాలను ఖమ్మం ఆర్టీఏ కార్యాలయంలో భద్రపరిచారు. ఆయా వాహనాల కేసులకు సంబంధించిన ప్రక్రియ ముందుకు సాగకపోవటం, వాహనదారులు సైతం తమ వాహనాలను విడిపించుకుపోయేందుకు ఆసక్తి చూపకపోవటంతో కొన్నేళ్లుగా మూలకు చేరుకున్నాయి. తనిఖీల్లో పట్టుబడిన వాహనాల్లో కొద్దోగొప్పో పనిచేసేవి సైతం అస్సలు నడిచే పరిస్థితి లేకుండా పోతోంది. వానలకు తడుస్తూ. . ఎండలకు ఎండుతూ తుక్కుగా మారిపోయి నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. రవాణా శాఖ అధికారులు సైతం వాటిని వేలం వేయకుండా అలానే వదిలేస్తున్నారు. పోలీసు, ఆబ్కారీశాఖ వాహనాలు సైతం ఉండటంతో అధికారుల మధ్య సమన్వయం కొరవడింది. గతంలో పట్టుబడిన వాహనాల వేలం ప్రక్రియపై కొంత కదలిక వచ్చినప్పటికీ కార్యరూపం దాల్చలేదు.

– ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే

భారీగా పెరిగిన పిచ్చిమొక్కలు

ఇటీవల కురిసిన వర్షాలకు ఖమ్మం ఆర్టీఏ కార్యాలయ ప్రాంగణంలో పిచ్చిమొక్కలు భారీగా పెరిగిపోయాయి. పట్టుబడిన వాహనాల వద్ద, ఖాళీ స్థలంలో పిచ్చిమొక్కలు కమ్మేశాయి. చెత్తాచెదారం సైతం విపరీతంగా పెరిగిపోవడంతో అటువైపు వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. పురుగులు, కీటకాలు, పాములు వంటి వాటికి ఆవాసాలు మారిపోతున్నాయి. జిల్లా రవాణా శాఖ కార్యాలయానికి వచ్చే దరఖాస్తుదారులు, సందర్శకులు ఖాళీ స్థలాన్ని మూత్రశాలగా వినియోగిస్తున్నారు. ఇకనైనా రవాణా శాఖ అధికారులు, పోలీసులు, ఆబ్కారీ అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ పట్టుబడిన వాహనాలను వేలం వేసేందుకు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

పట్టుబడిన వాహనాల్లో ఎక్కువగా పోలీసు, ఆబ్కారీ శాఖల వాహనాలు ఉన్నాయి. రవాణా శాఖకు చెందినవి సైతం ఉన్నప్పటికీ వేలం ప్రక్రియ చేపట్టడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పాత వాహనాల రక్షణపై జాగ్రత్తలు తీసుకుంటున్నాం. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రాంగణంలో పిచ్చిమొక్కలు పెరిగాయి. వర్షాలు తగ్గిన తర్వాత పిచ్చిమొక్కలను తొలగిస్తాం.

– వి.వెంకటరమణ, జిల్లా ఇన్‌ఛార్జి రవాణా శాఖాధికారి

పారిశుద్ధ్యంపై శ్రద్ధ అవసరం: డీఎల్పీవో



పారిశుద్ధ్య పనులు పర్యవేక్షిస్తున్న డీఎల్పీవో రాంబాబు

నేలకొండపల్లి, న్యూస్‌టుడే: గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని డీఎల్పీవో టి.రాంబాబు సూచించారు. నేలకొండపల్లిలో శుక్రవారం పలు వీధులను పరిశీలించారు. పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని కార్యదర్శి శ్రీనివాసరావుకు సూచించారు. ఎంపీడీవో యర్రయ్య, ఎంపీవో శివ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి: సీఈఓ

తిరుమలాయపాలెం, న్యూస్‌టుడే: మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని నాబార్డు సీఈఓ ఇమడపాక వెంకన్న సూచించారు. బచ్చోడులో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల్లో చేరిన మహిళలు స్వయంశక్తితో రాణించాలని, కుటుంబానికి ఆర్థికంగా అండగా ఉండేలా ఎదగాలన్నారు. మహిళలకు ఎంబ్రాయిడరీ, మగ్గం వర్క్ శిక్షణ శిబిరం ప్రారంభించారు. శిక్షణ అనంతరం ప్రతిభ కనబరిచిన వారికి సంబంధిత వస్తు సామగ్రితోపాటు కంప్యూటర్లు అందించి మరో 20రోజుల శిక్షణ అందిస్తామన్నారు. నాబార్డు ప్రతినిధులు పాల్గొన్నారు.



మహిళలకు ఎంబ్రాయిడరీ సామగ్రి అందిస్తున్న సీఈఓ తదితరులు

నగరంలో సినిమాలు..

శ్రీనివాస: వెట్టయన్, శ్రీసాయిరాం: విశ్వం
వినోద: జనక అయితే గనక
సీఎన్ సినీ గెలాక్సీ: ఇద్దరు
శ్రీతిరుమల: దేవర పార్ట్-I,
కేపీఎస్: సలార్(ఒక ఆట), రాధే కృష్ణ(నాలుగు ఆటలు)

సీపీని కలిసిన టీఎన్జీఓ సంఘం నేతలు

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: సకల ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి హాజరు కావాలని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌ను టీఎన్జీఓ సంఘం నేతలు కొణిదెన శ్రీనివాసరావు, గంగవరపు బాలకృష్ణ, జైపాల్, రమణయాదవ్ కోరారు. ఖమ్మంలో శుక్రవారం సీపీని కలిసి తెలంగాణ ఉద్యోగ ఐకాస ఆధ్వర్యంలో నవంబరు 3న సకల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు వివరించారు. శ్రీనివాస్, రాధాకృష్ణ, ముఖిత్ పాల్గొన్నారు.

సహాయ కమిషనర్‌గా బాధ్యతల స్వీకరణ

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ సహాయ కమిషనర్‌గా షఫీఉల్లా శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు కమిషనర్ అభిషేక్ అగస్త్యను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.

ఉద్యోగ మేళాకు 92 మంది హాజరు

ఖమ్మం సారథినగర్, న్యూస్‌టుడే: ఉపాధి కల్పన శాఖ శుక్రవారం ఖమ్మం మోడల్ కెరీర్ సెంటర్‌లో నిర్వహించిన ఉద్యోగ మేళాలో 92 మంది పాల్గొన్నారు. రిలయన్స్ ట్రెండ్స్‌లో 4, భారత్ హుందయ్‌లో 6, ముత్తూట్‌ఫైనాన్స్‌లో 13 మందికి ఆయా సంస్థలు నియామకపత్రాలు అందజేసినట్లు ఉపాధి కల్పన అధికారి మాధవి తెలిపారు.

వెదజల్లే పద్ధతిలో వరి సాగుపై శిక్షణ

రఘునాథపాలెం, న్యూస్‌టుడే: కేవీ బంజరలో వెదజల్లే(కరివేద) పద్ధతిలో వరిసాగుపై రైతు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. వ్యవసాయ శాఖ రైతు శిక్షణ కేంద్రం, తార్టర్న్ పీఏ ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏఓలు భాస్కరరావు, ఉమామహేశ్వర్‌రెడ్డి రైతులకు అవగాహన కల్పించారు.

నూతన విద్యా విధానం రద్దు కోసం ఉద్యమించాలి

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జాతీయ నూతన విద్యా విధానం రద్దుకై విద్యార్థులు ఉద్యమించాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ పిలుపునిచ్చారు. ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన విద్యా విధానాన్ని రాష్ట్రంలో అమలు చేస్తామని ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రకటించడం సరైంది కాదన్నారు. శివనాయక్, వంశీ, రాకేశ్, ప్రతాప్ పాల్గొన్నారు.

రేపు నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: ది ఖమ్మం గ్రానైట్ స్లాబ్ ఫ్యాక్టరీ ఓనర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ప్రతినిధులు ఆదివారం నగరంలోని ఓ గార్డెన్‌లో ప్రమాణ స్వీకారం చేస్తారని ప్రస్తుత అధ్యక్షుడు వెంకట రమణ తెలిపారు. ఖమ్మంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నూతన కమిటీ రెండేళ్లు కొనసాగనుందని చెప్పారు. నూతన కమిటీ అధ్యక్షుడు పాటిబండ్ల యుగంధర్, కార్యదర్శి కమర్తపు గోపాలరావు, పరమేశ్వరరెడ్డి, సాగర్, స్వేదన్ పాల్గొన్నారు.

20న నెల నెలా.. వెన్నెల

ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే: అభ్యుదయ సాంస్కృతిక కదంబం నెల నెలా.. వెన్నెల కార్యక్రమం ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో ఈ నెల 20న నిర్వహించనున్నట్లు అన్నాబత్తుల రవీంద్రనాథ్, కళా సాంస్కృతిక సంస్థ కార్యదర్శి అన్నాబత్తుల సుబ్రహ్మణ్యకుమార్, ఖమ్మం కళాపరిషత్ అధ్యక్షుడు డా.నాగబత్తిని రవి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

22న కార్గో పార్సిళ్ల వేలం

ఖమ్మం కమాన్‌బజార్ న్యూస్‌టుడే: ఖమ్మం డిపో పరిధిలోని అపరిష్కృతంగా ఉన్న కార్గో పార్సిళ్లను ఈ నెల 22న వేలం వేయనున్నట్లు ఆర్టీసీ లాజిస్టిక్స్ రీజినల్ మేనేజర్ పవన్‌కుమార్ తెలిపారు. వినియోగదారులు తీసుకెళ్లకుండా నిల్వ ఉన్న వాటిని క్లియర్ చేయడానికి ఈ ప్రక్రియ చేపడుతున్నట్లు వివరించారు.

అర్హులైన పేదలకు ఇళ్లు మంజూరు చేయాలి

కామేపల్లి, న్యూస్‌టుడే: అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని భాజపా జిల్లా కమిటీ సభ్యుడు జాలె శ్రీను యాదవ్ అన్నారు. కామేపల్లిలో ఆయన విలేకరులతో శుక్రవారం మాట్లాడారు. ఏర్పాటు చేసే ఇందిరమ్మ కమిటీల్లో అన్ని పార్టీల నాయకులకు అవకాశం కల్పించాలన్నారు.

విలీన సభ విజయవంతం చేయండి

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: దేశంలో బలమైన కార్మికవర్గ ఉద్యమాలను నిర్మించేందుకే ఇప్పటను కేంద్ర కార్మిక సంఘమైన టీయూసీఐలో విలీనం చేస్తున్నట్లు ఇఫ్టూ జిల్లా సహాయ కార్యదర్శి ఆవుల అశోక్ తెలిపారు. నగరంలోని రైల్వేస్టేషన్, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల, అర్బన్, రఘునాథపాలెం కేజీబీవీల్లో శుక్రవారం విలీన సభ గోడ పత్రికలను ఆవిష్కరించారు. కరుణకుమారి, కోటిలింగం, విజయకుమారి పాల్గొన్నారు.

రఘునాథపాలెం: టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ విలీన సభ గోడపత్రికను రాంక్యాతండాలో ఆవిష్కరించారు. 20న జరిగే సభను కార్మికులు విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ నాయకుడు భూక్యా రవి పిలుపునిచ్చారు.

నేడు సాయిబాబా సంస్మరణ సభ

ఖానాపురం హవేలి: ఆచార్య సాయిబాబా సంస్మరణ సభ ఖమ్మం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించనున్నట్లు ప్రత్యామ్నాయ పౌర సమూహం బాధ్యులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

అమరుల స్ఫూర్తితో ముందుకు సాగండి

ఖమ్మం గ్రామీణం: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు గంగవరపు విజయ్‌కుమార్ పోరాట స్ఫూర్తితో నేటి యువత ముందుకు సాగాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేశ్, రాష్ట్ర నాయకుడు మౌలానా అన్నారు. ఎంవీపాలెంలో విజయ్‌కుమార్ వర్ధంతి సభను శుక్రవారం నిర్వహించారు. సుధాకర్, చిన్నవెంకటరెడ్డి, కమలాకర్ పాల్గొన్నారు.

నగరంలో రహదారులకు మరమ్మతులు



భూమిపూజలో మేయర్ నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య తదితరులు

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరంలో వరదల కారణంగా దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేపడుతున్నట్లు మేయర్ పునుకొల్లు నీరజ తెలిపారు. నగరంలోని 48వ డివిజన్ గణేష్‌నగర్‌లో రహదారి మరమ్మతుల పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. రూ.10లక్షలతో ఈ పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. కమిషనర్ అభిషేక్ అగస్త్య, కార్పొరేటర్ గోవిందమ్మ, అధికారులు పాల్గొన్నారు.

పనుల నాణ్యతలో రాజీపడొద్దు

ఖమ్మం కార్పొరేషన్: నగరంలో చేపట్టే అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీపడొద్దని కమిషనర్ అభిషేక్ అగస్త్య అధికారులకు సూచించారు. 59, 60 డివిజన్లలోని దానవాయిగూడెం, రామన్నపేట ప్రాంతాల్లో పూర్తయిన పలు పనులను శుక్రవారం పరిశీలించారు. అధికారులు పాల్గొన్నారు.

పోటీపడి.. సత్తా చాటి..

'ఈనాడు' ఆధ్వర్యంలో ఖమ్మంలోని రోటరీనగర్ జడ్పీ ఉన్నత పాఠశాల, రిక్కాబజారు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, శ్రీనివాసనగర్ గీతాంజలి విద్యానికేతన్ పాఠశాలలో ప్రతిభా పాటవ పోటీలను శుక్రవారం నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై జరిగిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో రోటరీనగర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో పి.లక్ష్మీప్రసన్న, బి.సాత్విక్, టి.సంజయ్‌కుమార్ నిలిచారు. వీరికి ప్రధానోపాధ్యాయుడు నాగేంద్రబాబు బహుమతులు అందజేశారు. రిక్కాబజారు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డి.అక్షయ్‌చందన్, డి.సిరివల్లి, ఎన్.కావ్య తొలి మూడు స్థానాలను కైవసం చేసుకున్నారు. వీరికి బహుమతులను ప్రధానోపాధ్యాయురాలు శాంత ప్రదానం చేశారు.



ఖమ్మం: విజేతలతో రోటరీనగర్ జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగేంద్రబాబు, ఉపాధ్యాయులు

శ్రీనివాసనగర్ గీతాంజలి విద్యానికేతన్ పాఠశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఎన్.దీపిక, డి.బిందుప్రియ, ఎన్.కార్తీక నిలిచారు. వీరికి పాఠశాల డైరెక్టర్ టీవీ అప్పారావు బహుమతులు అందజేశారు. డైరెక్టర్లు పద్మ, అరుణ్ కుమార్ పాల్గొన్నారు.



రిక్కాబజారు ప్రభుత్వ పాఠశాలలో విజేతలతో హెచ్.ఎం శాంత, తదితరులు



విజేతలతో గీతాంజలి విద్యానికేతన్ డైరెక్టర్లు టీవీ అప్పారావు, పద్మ, అరుణ్‌కుమార్

జోరందుకున్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం(ఎల్ఆర్ఎస్) దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ వేగవంతమైంది. నగరపాలక సంస్థ పరిధిలో 39,945 దరఖాస్తులు రాగా ఇప్పటివరకు 2,026 దరఖాస్తులు ఆమోదం పొందాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం నుంచి వార్డు అధికారులకు క్షేత్రస్థాయి పరిశీలన బాధ్యతలు అప్పగించారు. డివిజన్ల వారీగా సిబ్బందిని నియమించుకొని దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. ఒక్కరోజే 200కు పైగా స్థలాలను సందర్శించారు. ఇప్పటివరకు మూడు బృందాలతోనే వీటిని పరిశీలించగా, ఇప్పుడు వాటి సంఖ్య పది వరకు పెరిగింది. ఎల్ఆర్ఎస్-2020 యాప్ ఆధారంగా తొలిదశలో క్షేత్రస్థాయికి వెళ్లి తనిఖీ చేయాల్సి ఉండగా ఆ ప్రక్రియ జోరందుకుంది. ఆ తరువాత రెండు, మూడు దశల్లో ప్రణాళిక విభాగం అధికారులు కార్యాలయంలోనే వాటిని పరిశీలించి ఆమోద ముద్ర వేయనున్నారు.



బల్లేపల్లిలో లేఅవుట్లను పరిశీలిస్తున్న అధికారులు

రాష్ట్రస్థాయిలో విద్యార్థినికి ప్రథమ స్థానం

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఇండియన్ ఎన్‌జీఓ అవార్డు కౌన్సిల్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి మల్టీ టాలెంటెడ్ ఇన్ వెబ్ డిజైనింగ్, కోడింగ్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థిని జి.షణ్ముఖప్రియ రాష్ట్రం నుంచి ప్రథమ స్థానంలో నిలిచినట్లు ఖమ్మం హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపల్ ఆర్.పార్వతిరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10న ఆన్‌లైన్ వేదికగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బెంగళూరు ఎన్‌జీఓ అవార్డు కౌన్సిల్ వారి ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. అవార్డు సాధించిన విద్యార్థినిని వారు అభినందించారు.



షణ్ముఖప్రియతో రవిమారుత్, పార్వతిరెడ్డి

'చెరువుమాదారం'లో చేప పిల్లలు విడుదల

నేలకొండపల్లి, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ప్రధాన చెరువుల్లో శుక్రవారం చేపపిల్లల్ని వదిలారు. చెరువుమాదారం చెరువు, నేలకొండపల్లిలోని బాలసముద్రం, కట్టలమ్మ చెరువుల్లో మత్స్య శాఖ జిల్లా అధికారి శివప్రసాద్ ఆధ్వర్యంలో ఆయా సంఘాల బాధ్యుల సమక్షంలో చేపపిల్లల్ని వదిలారు. స్థానిక అధికారులకు సైతం అప్పటికప్పుడు సమాచారమందించినట్లు తెలుస్తోంది. మత్స్య సహకార సంఘం బాధ్యులు ధీరావత్ రాధాకృష్ణ, మైసా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

కామేపల్లి, న్యూస్‌టుడే: పండితాపురం వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి పల్టీ కొట్టిన ఘటనలో పొన్నెకల్‌కు చెందిన కె.కోటేశ్వరరావుకు శుక్రవారం తీవ్ర గాయాలయ్యాయి. ఆయన్ను 108లో ఖమ్మం ఆసుపత్రికి తరలించారు.

ద్విచక్రవాహనంపై రేషన్ బియ్యం తరలింపు?

రఘునాథపాలెం: పాపటపల్లిలో రేషన్ బియ్యం బస్తాల్లో తరలించడం చర్చనీయాంశమైంది. గ్రామంలోని ఓ రేషన్ దుకాణం నుంచి ద్విచక్రవాహనంపై పెద్ద ఎత్తున బియ్యం బస్తాలు వేసుకుని తరలిస్తున్న చిత్రాలు చక్కర్లు కొడుతున్నాయి. నిఘా లేక పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం అక్రమార్కుల పాలవుతున్నాయని ఆరోపిస్తున్నారు. ఏజెంట్లు రాత్రివేళ లారీల్లో రవాణా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. జీకే బంజర, కోయచలక, కామేపల్లి మండలం పండితాపురం తదితర గ్రామాల్లో ఈ వ్యాపారం జోరుగా సాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తహసీల్దార్ లూథర్ విల్సన్‌ని సంప్రదించగా.. విషయం తమ దృష్టికి రాలేదని, పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కాలనీలో దొంగల సంచారం...

ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: కాలనీలో అర్ధరాత్రి ఆటోలో వచ్చిన అపరిచిత వ్యక్తులు సంచరించిన సంఘటనకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తున్నాయి. ఖమ్మం నగర 16వ డివిజను శ్రీరాంనగర్ 13, 14వీధుల్లో ఈనెల 15వ తేదీ అర్ధరాత్రి(16 తెల్లవారుజామున) ఆటోలో వచ్చిన వ్యక్తులు సంచరించారు. అదే సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లేందుకు ద్విచక్రవాహనంపై వచ్చిన పోలీసు శాఖలో పనిచేసే ఓ వ్యక్తి వారిని ఎవరని ప్రశ్నించారు. ఏదో సమాధానం చెప్పి పంపారు. కొంత దూరం వెళ్లిన ఆయనకు అనుమానం వచ్చి తిరిగి రావడంతో అపరిచిత వ్యక్తులు పారిపోయి దాక్కోవడం కాలనీలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో నమోదైంది. దీనిని ఆలస్యంగా గుర్తించిన కాలనీవాసులు వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పెట్టడంతో చక్కర్లు కొడుతున్నాయి. అలాగే ఖానాపురంహవేలి పోలీసులకు వాటిని పంపి నిందితులను గుర్తించడంతోపాటు, కాలనీలో గస్తీ పెంచాలని కోరారు.

బంగారు ఆభరణాల దొంగ అరెస్టు

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: బంగారు గొలుసులు అపహరిస్తున్న దొంగను అరెస్టు చేసినట్లు మహబూబాబాద్ ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ తెలిపారు. మహబూబాబాద్ పట్టణ ఠాణాలో ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం.. మానుకోటలో పోలీసులు శుక్రవారం ఉదయం తనిఖీలు నిర్వహిస్తుండగా ఇల్లెందు రోడ్డులో ద్విచక్రవాహనంపై బయ్యారం వైపు నుంచి వస్తున్న ఆంగోతు విక్రమ్ పారిపోయేందుకు యత్నించాడు. పోలీసులు వెంబడించి అదుపులోకి తీసుకొని విచారించారు. 2013 వరకు విక్రమ్ తన తల్లిదండ్రులతో ఖమ్మంలో ఉండేవాడు. అనంతరం బయ్యారంలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. డిగ్రీ చదువుతూ చరవాణి ద్వారా ఆన్‌లైన్ బెట్టింగులకు పాల్పడి డబ్బులు పోగొట్టుకొన్నాడు. ఒంటరిగా వెళ్తున్న మహిళల మెడల్లోంచి బంగారు ఆభరణాలు అపహరించడం ప్రారంభించాడు. ఆ సమయంలో ఎవరూ గుర్తుపట్టకుండా ద్విచక్రవాహనం నంబర్ ప్లేటు మార్చి ముఖానికి మాస్కు ధరించేవాడు. మహబూబాబాద్ పట్టణం కృష్ణాకాలనీ, కంకరబోడ్ కాలనీలో ఒకటి చొప్పున, బ్యాంక్ కాలనీలో రెండు, ఖమ్మం ప్రాంతంలో ఏడు గొలుసు దొంగతనాలకు పాల్పడ్డాడు. అపహరించిన సొత్తును విక్రయించేందుకు మహబూబాబాద్‌కు వస్తుండగా అతడిని పట్టుకున్నట్లు ఎస్పీ తెలిపారు. 20.9 తులాల బంగారు ఆభరణాలు, ద్విచక్రవాహనం, చరవాణిని స్వాధీనపరచుకున్నామన్నారు. మరో 33 గ్రాముల బంగారు వస్తువులను ప్రైవేటు సంస్థలో తాకట్టు పెట్టాడన్నారు. నిందితుడిపై పీడీ చట్టం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు.

న్యాయం చేయాలంటూ అత్త ఇంటి ఎదుట నిరసన

ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: భర్త మరణంతో తనను ఇంటి నుంచి గెంటేశారని, తనకు, తన కుమార్తెకు న్యాయం చేయాలంటూ ఓ మహిళ నిరసన తెలిపిన ఘటన ఖమ్మం త్రీటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. బాధితురాలి కథనం ప్రకారం.. ముదిగొండ మండలానికి చెందిన తనకు ఖమ్మం సుందరయ్యనగర్ వాసితో 2020లో వివాహమైంది. వీరికి ఒక కుమార్తె జన్మించారు. 2022లో ఆమె భర్త జ్వరంతో మృతిచెందారు. ఆ తరువాత ఆరు నెలల వరకు మంచిగానే చూసుకున్న అత్తమామలు అపై ఆమెను గెంటేశారు. పెళ్లి సందర్భంగా పుట్టింటివారు రూ.10లక్షల నగదు, 10తులాల బంగారం, వెండి ఆభరణాలు, ఇంటి సామాన్లు ఇచ్చారని, వాటిని అత్తామామలు తిరిగివ్వటం లేదని బాధితురాలు వాపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని రెండువర్గాలతో మాట్లాడారు. సమస్యను పరిష్కరించామని పోలీసులు తెలిపారు.